

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777



మంగళవారం 18-08-2026 సంపుటి: 02 సంచిక : 108 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Tuesday, 18-08-2026 Volume :02 Issue: 108 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani


## కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా

# టిమ్స్

### సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

- రోజుకు 300 మందికి ని అందుబాటులోకి ఓపీ సేవలు
- పేదలకు అత్యున్నత స్థాయి ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు
- ఉస్మానియా, గాంధీ, నిమ్స్ తరహాలోనే టిమ్స్ ఆసుపత్రిలోనూ నాణ్యమైన వైద్యం
- దేశంలోనే తొలిసారిగా ఐఎ-ఆధారిత న్యూమాటిక్ ట్యూబ్ వ్యవస్థ
- ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక వసతులను ప్రవేశపెట్టడం హర్షణీయం

**తెలంగాణలో ప్రభుత్వ వైద్య వ్యవస్థను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్ది, పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాబోయే ఏడాదిన్నరలో ఉస్మానియా జనరల్ హాస్పిటల్, అల్వాల్, ఎల్‌బీనగర్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలను పూర్తి చేసి, దశలవారీగా సుమారు 10 వేల పడకలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అధునాతన వైద్య సేవలతో పాటు ఉచిత భోజనం, అటెండెంట్లకు డార్మెటరీలు, సూపర్ పీజీ--నర్సింగ్ విద్యా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. సనత్‌నగర్‌లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌ను ప్రారంభించిన సందర్భంగా సీఎం ఈ ప్రకటనలు చేశారు.**

హైదరాబాద్,

తెలంగాణలో ప్రభుత్వ వైద్య వ్యవస్థను మరింత బలోపేతం చేసి పేదలకు కార్పొరేట్ ఆసుపత్రులకు దీటైన వైద్యం అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. రాబోయే ఏడాదిన్నర కాలంలో ఉస్మానియా జనరల్ హాస్పిటల్, అల్వాల్ టిమ్స్, ఎల్‌బీనగర్ టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్ల నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు.

-మిగతా 2 లో






## తెలంగాణలో ఎస్ఐఆర్ ముసాయిదా

# ఓటర్ల జాబితా విడుదల

- 3.38 కోట్ల మంది ఓటర్లతో ముసాయిదా రూపకల్పన
- ఫారాలు సమర్పించిన 2.64 కోట్ల మంది
- 9.22 లక్షల మంది మృతి.. 57.46 లక్షల మంది పెండింగ్
- సుమారు 90 లక్షల మందికి నోటీసులు జారీ
- సెప్టెంబరు 16లోగా అభ్యంతరాలు తెలిపే అవకాశం
- పేరు లేకపోతే తొలగించినట్లు కాదన్న అధికారులు
- అర్హులైన ప్రతి ఓటరుకూ హక్కు కల్పించడమే లక్ష్యం

హైదరాబాద్,

తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి సోమవారం విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఎన్యూమరేషన్ ప్రక్రియలో సేకరించిన వివరాల ఆధారంగా ముసాయిదా జాబితాను రూపొందించినట్లు ఆయన తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో 2.64 కోట్ల మంది ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించినట్లు వెల్లడించారు. ఎన్యూమరేషన్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించగా 9.22 లక్షల మంది ఓటర్లు మరణించినట్లు గుర్తించినట్లు సీఈఓ తెలిపారు. మరో 57.46 లక్షల మంది ఓటర్ల వివరాలు చిరునామా మారడం,

-మిగతా 2 లో





# ఆ పథకాలు ఆగవు

- హైకోర్టు స్టేతో ఆగిపోయాయి
- డివిజన్ బెంచ్‌కు వెళ్తున్నాం
- బీఆర్ఎస్ నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి
- గ్రీన్ ఛానెల్ ద్వారా నిధుల విడుదల:
- మంత్రులు పొన్నం, వాకిటి శ్రీహరి

హైదరాబాద్,

పేద వర్గాలకు సంబంధించిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రభుత్వం కొనసాగిస్తుందని, ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేదని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ 2014 లో చేసిన తప్పిదం వల్లే న్యాయపరంగా ఇబ్బందులు తలెత్తాయని ఆరోపించారు. ఈ పథకాలకు గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

-మిగతా 2 లో



02

## ఇరాన్‌తో చేతులు కలిపితే

# ఒమన్‌పై దాడి..

- హోర్ముజ్ తెరిచే యత్నాలపై ట్రంప్ వార్నింగ్
- హోర్ముజ్ మూసివేతతో చమురు రవాణాకు బ్రేక్
- గల్ఫ్ దేశాలకు భారీ నష్టం
- అమెరికాతో కాకుండా ఇరాన్‌తో ఒప్పందానికి ఒమన్ యత్నం
- హోర్ముజ్ నౌకా మార్గంపై రెండు దేశాల ప్రతిపాదనలు
- ఐఆర్‌జీసీపై రహస్య ఛానెల్ ఏర్పాటు
- యుద్ధం త్వరగా ముగించే ఆలోచన లేదు: ట్రంప్



# జార్ఖండ్ జంగ్..

- 23వ రోజుకు విద్యార్థి ఆందోళన
- సీఎం సోరెన్, రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మల దహనం
- ఇక వ్యూహం మార్చుకుంటామన్న విద్యార్థి నేతలు
- సర్కార్ దిగిరాకపోతే.. సీఎం రాజీనామాకే డిమాండ్
- 20న ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి పిలుపు
- డిమాండ్లు నెరవేరుస్తారా.. రాజీనామా చేస్తారా
- జార్ఖండ్ సీఎంకు విద్యార్థుల హెచ్చరిక..
- హేమంత్, రాహుల్, తేజస్వీ యాదవ్ దిష్టిబొమ్మల దగ్ధం

02

## విడాకులివ్వకుండా రెండో పెళ్లి చేసుకుంటే జీతాల్లో 20 శాతం కోత..!



02

# పంద్రాగస్టు వేళ భారీ ఉగ్రకుట్ర భగ్నం

- ప్రహాజాజ్ భట్టీ నెట్‌వర్క్ ధ్వంసం
- 14 రాష్ట్రాల్లో సమన్వయంతో దాడులు
- 200 మందికిపైగా ఆపరేటివ్‌లు అరెస్టు
- తెలంగాణలోనూ అదుపులోకి ఇద్దరు
- భారీ మొత్తంలో ఆయుధాలు, సామగ్రి స్వాధీనం
- ఎక్స్ లో వెల్లడించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా

02



## ప్రజలను ఇబ్బంది పెడితే

# సహించేది లేదు

### 22ఎను భూతంగా చూపించొద్దు..




- జాప్యం లేకుండా సమస్యలు పరిష్కరించాలి
- అధికారులతో మంత్రి సచివాలయంలో సమీక్షా సమావేశం
- నిజమైన భూ హక్కుదారులకు న్యాయం చేయాలని ఆదేశం
- ప్రభుత్వ భూములు, ఆస్తుల పరిరక్షణ కూడా చాలా ముఖ్యం
- రికార్డులను సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలి
- ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు
- సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు

హైదరాబాద్,

(భూముల నిషేధిత జాబితా)ను భూతంగా చూపిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను హెచ్చరించారు. 22ఎ జాబితాలో భూమి ఉందనే కారణంతో ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని, సమస్యలను జాప్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. నిషేధిత భూముల అంశంపై రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఆర్డీవోలు, సబ్ రిజిస్ట్రార్లతో మంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 22ఎ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారం ఎవరికీ లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం అధికారుల బాధ్యత అని పొంగులేటి పేర్కొన్నారు. నిజమైన భూ హక్కుదారులకు న్యాయం చేయడంతో పాటు

-మిగతా 2 లో



# భారతీయులను వేటాడుతున్న ట్రంప్

- 4,800 మంది స్వదేశానికి పంపివేత
- 51 వేల మంది అరెస్టు
- రోజుకు 2 వేల అరెస్టులతో ట్రంప్ నయా రికార్డు
- భారతీయుల ఎదుగుదలపై అక్కసు
- ఏటా 10 లక్షల మందిని వెనక్కి పంపడం లక్ష్యం
- వలసదారులపై ఎలక్ట్రిక్ షాక్ గ్లవ్స్
- అమెరికా సెల్ఫ్ గోల్
- స్టాప్ ఏఏపీఐ హేట్ స్వచ్ఛంద సేవాసంస్థ వెల్లడి

వాషింగ్టన్:

అమెరికా ఫస్ట్ నినాదానికి ఊతమిస్తున్నట్లుగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. 4,800 మంది భారతీయులను స్వదేశానికి తిరిగి పంపించారు. 51 వేల మంది భారతీయులను అరెస్టు చేశారు. స్టాప్ ఏఏపీఐ హేట్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రకారం, ఆసియా, పసిఫిక్ ప్రాంతాలకు చెందిన ప్రజలందరి లోనూ

-మిగతా 2 లో



# రాష్ట్రంలో రాబోయేది బిజెపి ప్రభుత్వమే

- మేధావులంతా బిజెపి వైపు చూస్తున్నారు
- వందేమాతరం మన ఆచారం దానిని కించపరుస్తున్నారు
- కొన్ని పార్టీలు అర్బన్ నక్సలైట్లుగా వ్యవహరిస్తున్నాయి
- దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని కాంగ్రెస్ చూస్తోంది
- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు

హైదరాబాద్,

ఎంతో సంతోషంగా ఉంది. సమాజంలోని వివిధ వర్గాలు, వివిధ రంగాలకు చెందిన ఎంతో మంది భారతీయ జనతా పార్టీలో చేరుతున్నారు అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు చెందిన పలువురు భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విధానాలు, నాయకత్వం పట్ల ప్రభావితమై మరింత మంది బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారు. ఆల్వాల్ ప్రాంతానికి చెందిన పలువురు స్థానిక సామాజిక కార్యకర్తలు భారతీయ జనతా పార్టీలో చేరుతున్నారు. ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన పలువురు వెనుకబడిన వర్గాల నాయకులు, బీసీ నాయకులు కూడా బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారు. జరుగుతున్న ఈ చేరికల సందర్భంగా నేను ఒక విషయం

-మిగతా 2 లో

RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక

# తెలంగాణలో ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

మొదటి తరువాయి

అందుబాటులో లేకపోవడం, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలిపోవడం తదితర కారణాలతో పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఇతర ప్రాంతాల్లో ఇప్పటికే ఓటర్లుగా నమోదైన వారు, ప్రస్తుతం నివాసంలో లేని వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి వివరాలను కూడా అధికారులు పరిశీలించినట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు లేదా తమ వివరాలపై అభ్యంతరాలు ఉన్న వారికి సుమారు 90 లక్షల నోటీసులు జారీ చేయనున్నట్లు సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. నోటీసులు అందుకున్న వారు సెప్టెంబర్ 16వ తేదీలోగా తమ అభ్యంతరాలను సంబంధిత ఆధారాలతో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన ఓటర్లు తమ పేర్లు ముసాయిదా జాబితాలో ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే నిర్ణీత గడువులోగా సరిదిద్దుకునే అవకాశం వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే నాటికి తెలంగాణ ఓటర్ల జాబితాలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతం ముసాయిదా జాబితాలో పేర్లు కనిపించని వారిని తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్లు భావించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం సంబంధిత ఆధారాలను పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హులైన వారి పేర్లను చేర్చడం లేదా కొనసాగించడంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన ఓటరుకు ఓటు హక్కు ఉండేలా, అదే సమయంలో ఓటర్ల జాబితాలో అనర్హమైన లేదా పునరావృతమైన నమోదులు లేకుండా చూడటమే ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. ముసాయిదా జాబితా విడుదల నేపథ్యంలో ఓటర్లు నిర్లక్ష్యం చేయకుండా తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. తుది జాబితా విడుదలకు ముందు అభ్యంతరాలు, ఆధారాల పరిశీలన ప్రక్రియ పూర్తవుతుందని, ఆ తర్వాతే తుది ఓటర్ల జాబితాపై నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు.

# ఆ పథకాలు ఆగవు

మొదటి తరువాయి

సోమవారం సచివాలయంలో పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి బాలమాయదేవితో కలిసి మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కళ్యాణ లక్ష్మి పథకానికి సంబంధించి ఇప్పటి వరకు జారీ చేసిన 8 జీవోలను సవాల్ చేస్తూ కొందరు హైకోర్టులో రిట్ పిటిషన్ 21732/2026 దాఖలు చేశారని, ఈ పిటిషన్ విచారణ సందర్భంగా పథకాన్ని అక్టోబర్ 9 వరకు నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసిందని మంత్రి వెల్లడించారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్‌కు వెళుతున్నామని స్పష్టం చేశారు. డివిజన్ బెంచ్ సానుకూల నిర్ణయం వెలువరిస్తుందని ఆశిస్తున్నట్లు మంత్రి చెప్పారు. కేసీఆర్ సర్కార్ చేసిన తప్పిదాలను ఎన్నో ఉన్నాయని, కాళేశ్వరం మొదలు కొని కళ్యాణలక్ష్మి వరకు ఒక్కో తప్పిదాన్ని సరి చేస్తూ వస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం లోపభూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే ఈ పథకం ఇలా అయిందని, కౌంటర్ ఫైల్ చేయడానికి అధికారుల లోపమా లేదా ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలు చూసే వారి లోపమా అని విచారణ చేస్తున్నామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పథకం నిలుపుదల చేస్తూ ఈ నెల 12 న హైకోర్టు మధ్యంతర నిలుపుదల (ఇంటెరిమ్‌స్టే) విధించిందని, స్టే ఎత్తివేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలని, పేదింటి ఆడబిడ్డ వివాహ సమయంలో కుటుంబంపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశ్యమని చెప్పారు

# జార్ఖండ్ జంగ్..



**-23వ రోజుకు విద్యార్థి ఆందోళన**
**-సీఎం సోరెన్, రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మల దహనం**
**-ఇక వ్యూహం మార్చుకుంటామన్న విద్యార్థి నేతలు**
**-సర్కార్ దిగిరాకపోతే.. సీఎం రాజీనామాకే డిమాండ్**
**-20న ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి పిలుపు**
**-డిమాండ్లు నెరవేరుస్తారా.. రాజీనామా చేస్తారా**
**-జార్ఖండ్ సీఎంకు విద్యార్థుల హెచ్చరిక..**
**-హేమంత్, రాహుల్, తేజస్వీ యాదవ్ దిష్టిబొమ్మల దగ్ధం**

రాంచి

జేపీఎస్‌సీ–జేఎస్ఎస్‌సీ విద్యార్థుల నిరసనలు ఆదివారంతో 23వ రోజుకు చేరుకున్నాయి. విద్యార్థులు తమ నిరసనల వ్యూహాన్ని మార్చుకుంటున్నట్టు ప్రకటించారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే సీఎం హేమంత్ సోరెన్ రాజీనామాను కోరుతామని హెచ్చరించారు. అంతే కాకుండా ఆగస్టు 20న సీఎం ఇంటికి మార్చ్ నిర్వహిస్తామని ప్రకటించారు. దీంతో నిరసనలు మరో మలుపు తిరిగాయి. ఆగస్టు 10న నిర్వహించిన అసెంబ్లీ మార్చ్‌లో విద్యార్థులపై పోలీసులు వాటర్ కానన్లు, టియర్ గ్యాస్ వినియోగించడంతో పాటు లాఠీ చార్జ్ చేయడంతో అప్పటి నుంచే నిరసనలు మరింత ఉధృతంగా మారాయి. ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తున్న వారిలో ఒకరైన పియూష్ సింగ్ మాట్లాడుతూ స్టూడెంట్లు నాలుగు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచినట్టు చెప్పారు. జేఎస్ఎస్‌సీ–సీజీఎల్ పరీక్షను రద్దు చేయడం, జేపీఎస్–సీ 11వ, 13వ పరీక్షలను రద్దు చేయడంతో పాటు టీడీపీఎల్ సంస్థతో సంబంధం ఉన్న అన్ని పరీక్షలను రద్దు చేసి ప్రస్తుతం జరుగుతున్న విచారణలను సీబీఐకి అప్పగించాలని కోరుతున్నారని వెల్లడించారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఆగస్టు 20న అసలు సినిమా ఉంటుందన్నారు. సీఎం రాజీనామాను కోరుతామని హెచ్చరించారు. అయితే జేపీఎస్‌సీకి సంబంధించిన మూడు పరీక్షలను రద్దు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ సీజీఎల్ కు సంబంధించిన పరీక్షను రద్దు చేయడం కుదరదని.. అది కోర్టుల పరిధిలో ఉందని ఓ మంత్రి పేర్కొన్నారు. సీఎం ఇల్లు ముట్టడి ప్రకటన నేపథ్యంలో పోలీసులు ఆయన ఇంటి వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.


దిష్టిబొమ్మల దగ్ధం..

అంతకు ముందు విద్యార్థులు జైపాల్ సింగ్ ముండా స్టేడియం నుంచి ఆల్బర్ట్ ఎక్కా చౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అక్కడ రాహుల్ గాంధీ, సీఎం హేమంత్ సోరెన్, ఆర్జేడీ అధినేత తేజస్వీ యాదవ్‌ల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. కాంగ్రెస్ కూటమి నుంచి వైదొలగి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

ఎక్కువ రోజులు బతుకను..

నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థుల్లో ఒకరైన ప్రేమ్ నాయక్ ఆదివారం మాట్లాడుతూ 13 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నానని ఎక్కువ కాలం బతికేలా లేనని తెలిపారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవట్లేదని.. సీఎంకు ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. చివరిదాకా పోరాటం కొనసాగిస్తానన్నారు.

## విడాకులివ్వకుండా రెండో పెళ్లి చేసుకుంటే జీతాల్లో 20 శాతం కోత..!



న్యూఢిల్లీ:

బహుభార్యత్వాన్ని నిర్మూలించే దిశగా కీలక చర్యలు చేపడుతున్న అస్సాం సర్కారు .. అందుకోసం తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో కోత పెట్టనున్నట్లు తెలిపింది. ఈ మేరకు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సోమవారం కీలక ప్రకటన చేశారు.ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా చట్టబద్ధంగా తన భార్య నుంచి విడాకులు తీసుకోకుండా ఆమెను వదిలేసి మరో మహిళతో వివాహ బంధం ఏర్పరుచుకుంటే సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని సీఎం తన ప్రకటనలో హెచ్చరించారు. ఆ ఉద్యోగి జీతం నుంచి 20 శాతం కోత విధించి, ఆ మొత్తాన్ని మొదటి భార్య బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తామని తెలిపారు. అయితే ఆ ఉద్యోగి మొదటి భార్య దీని గురించి ప్రభుత్వం వద్ద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని సీఎం చెప్పారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగుల్లో కొంతమంది విడాకుల ప్రక్రియ పూర్తికాకుండానే మరో మహిళతో కలిసి ఉంటున్న కేసులు వెలుగుచూసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు హిమంత తెలిపారు. విడాకుల అంశం కోర్టు వద్ద పెండింగ్‌లో ఉన్నా కూడా.. జీతంలో కోత కొనసాగుతుందని స్పష్టంచేశారు. న్యాయపరమైన ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎదురుచూడకుండా మొదటి భార్యకు ఆర్థిక సహకారం అందించాలనేదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇక తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల వేతనంలో 10 శాతం కోత విధించనున్నట్లు హిమంత తెలిపారు.

# కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా టిమ్స్

మొదటి తరువాయి

ప్రతి ఆరు నెలలకు ఒక ఆసుపత్రి చొప్పున నిర్మాణం పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. హైదరాబాద్ సనత్‌నగర్‌లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డాక్టర్ ఎంసీఆర్‌టిమ్స్)ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్‌బీనగర్ టిమ్స్, వరంగల్ ఆసుపత్రుల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ ఆసుపత్రులన్నీ అందుబాటులోకి వస్తే రాష్ట్రంలో సుమారు 10 వేల పడకలు పేదలకు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. తద్వారా పేదలకు ప్రభుత్వ వైద్యంపై మరింత నమ్మకం, భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. ఎయిమ్స్‌తో పోటీపడే స్థాయిలో సేవలు అందిస్తున్న నిమ్స్ తరహాలోనే కొత్త ఆసుపత్రులను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి తెలిపారు. ఒక్కో ఆసుపత్రికి ప్రత్యేకంగా ఒక్కో డైరెక్టర్‌ను నియమించి వారి పర్యవేక్షణలో వైద్య సేవలను నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆసుపత్రుల నిర్మాణానికే కాకుండా వాటి నిర్వహణకు కూడా అవసరమైన నిధులు సమకూరుస్తామని, కార్పొరేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కొత్త ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఉచితంగా భోజనం అందించడంతో పాటు వారి అటెండెంట్లకు వసతి కల్పించేందుకు డార్మెటరీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన నిధులను కేటాయించడంతో పాటు సూపర్ పీజీ, నర్సింగ్ కళాశాలలను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్య సేవలతో పాటు విద్య, శిక్షణకు కూడా ఈ ఆసుపత్రులను కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్నారు. వైద్య రంగంలో ఇప్పటికే పెద్దఎత్తున నియామకాలు చేపట్టామని సీఎం తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 16 వేల మంది సిబ్బందిని నియమించామని చెప్పారు. గతంలో ఎన్నడూ ఇంత పెద్దఎత్తున వైద్య సిబ్బంది నియామకాలు జరగలేదని పేర్కొన్నారు. నర్సింగ్ రంగంలో పనిచేస్తున్న వారికి అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించే దిశగా శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. జర్మన్, జపనీస్, కొరియన్ వంటి భాషలను నేర్చుకుంటే ఆయా దేశాల్లో లక్షలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పేదల ఆరోగ్యాన్ని ప్రభుత్వం తన బాధ్యతగా భావిస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. విద్య, వైద్యానికి కేటాయించే నిధులను ఖర్చుగా కాకుండా భవిష్యత్తు తరాలకు పెట్టుబడిగా పరిగణిస్తున్నామని చెప్పారు. పేద కుటుంబాల్లో పిల్లల చదువులు, తల్లిదండ్రుల వైద్యం అత్యంత ఖరీదైన అంశాలుగా మారాయని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునే స్థోమత లేక పేదలు ఆస్తులు అమ్ముకునే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని నాలుగు కోట్ల మంది ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండాలని, ముఖ్యంగా పేదలకు ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. గుండె, కిడ్నీలు, అవయవ మార్పిడి వంటి క్లిష్టమైన వైద్య సేవలు కూడా పేదలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో సనత్‌నగర్‌లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి పేరు మీద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభించడం ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. ప్రజా ప్రభుత్వం 32 నెలల పాలనలో ఆరోగ్యశ్రీ కోసం దాదాపు రూ.2,700 కోట్లు ఖర్చు చేసిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మరో రూ.2,526 కోట్లు ఖర్చు చేశామని, ఈ రెండు పథకాల ద్వారా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో మొత్తం రూ.5,226 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. పేదల వైద్యం కోసం ఈ స్థాయిలో నిధులు కేటాయించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. ఆరోగ్య, వైద్య శాఖకు గతంలో ప్రతి ఏడాది సగటున రూ.13 వేల కోట్ల బడ్జెట్ కేటాయింపులు ఉండగా, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు రూ.21,800 కోట్ల నిధులను ఖర్చు చేసినట్లు సీఎం తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పేదల వైద్యానికి అవసరమైన నిధులను నిరంతరం అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. వందేళ్ల క్రితం నిజాం ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన ఉస్మానియా జనరల్ హాస్పిటల్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందని రేవంత్‌రెడ్డి అన్నారు. వర్షాలు కురిసినప్పుడు ఆసుపత్రిలోకి నీరు చేరే పరిస్థితి ఉందని, అక్కడ వైద్య సేవలు అందించడం కూడా కష్టంగా మారిందని పేర్కొన్నారు. గత పదేళ్లలో ఉస్మానియా ఆసుపత్రిని మరోచోట నిర్మించాలన్న ఆలోచన జరగలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉస్మానియా ఆసుపత్రికి సమీపంలోని గోషామహల్‌లో 30 ఎకరాల విస్తీర్ణంలో రూ.2,700 కోట్ల అంచనా వ్యయంతో 2,000 పడకల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేపట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ప్రభుత్వ వైద్యులు అదనపు సమయం పనిచేసేలా ప్రోత్సాహకాలు అందించాలని సీఎం సూచించారు. సర్జరీలు నిర్వహించడం, అదనపు సేవలు అందించడం వంటి వాటికి ప్రత్యేకంగా ఇన్సెంటివ్‌లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని ఆదేశించారు. ప్రభుత్వ వైద్యుల నైపుణ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖను సమగ్రంగా ప్రక్షాళన చేసి ప్రజల్లో ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలని ముఖ్యమంత్రి అన్నారు. కష్టకాలంలో ప్రభుత్వం తమకు అండగా ఉందన్న భరోసా పేదలకు కల్పించాలన్నారు. పేదలకు నమ్మకం, విశ్వాసం కల్పించగలిగితేనే ప్రభుత్వ సేవలకు సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. విద్యా రంగంలోనూ సమూల మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రేవంత్‌రెడ్డి తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, ఆ తర్వాత అవసరమైన నైపుణ్యాలను నేర్పించగలిగితే యువత స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సొంతంగా అందిపుచ్చుకోగలరన్నారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆధారపడకుండా తమ కాళ్లపై తాము నిలబడేలా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. సనత్‌నగర్‌లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రారంభం తెలంగాణకు మరో ఆణిముత్యాన్ని అంకితం చేసిన సందర్భమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆసుపత్రి నిర్మాణం, ప్రారంభోత్సవం కోసం అహర్నిశలు కృషి చేసిన మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు అధికారులు, వైద్య సిబ్బందిని ఆయన అభినందించారు.

# పంద్రాగస్టు వేళ భారీ ఉగ్రకుట్ర భగ్నం



**-షహాజాజ్ భట్టీ నెట్‌వర్క్ ధ్వంసం**
**-14 రాష్ట్రాల్లో సమన్వయంతో దాడులు**
**-200 మందికిపైగా ఆపరేటివ్‌లు అరెస్టు**
**-తెలంగాణలోనూ అదుపులోకి ఇద్దరు**
**-భారీ మొత్తంలో ఆయుధాలు, సామగ్రి స్వాధీనం**
**-ఎక్స్ లో వెల్లడించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా**

న్యూఢిల్లీ:

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు ప్రణాళిక చేసిన ఐఎస్ఐ మద్దతుతో నడుస్తున్న షాజాద్ భట్టీ నెట్‌వర్క్‌ను కేంద్ర ప్రభుత్వం ధ్వంసం చేసింది. ఈ నెట్‌వర్క్ కు చెందిన 200 మందికి పైగా కార్యకర్తలను అరెస్టు చేసినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎక్స్‌లో చేసిన పోస్టులో పేర్కొన్నారు. 14 రాష్ట్రాల్లో, వివిధ ప్రాంతాల్లో సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ల ద్వారా భారత భద్రతా దళాలు ఈ నెట్‌వర్క్‌ను ఛీల్చి చెండాడాయి. ఇది తీవ్రవాదంపై భారత్ వైఖరికి ఉత్తమ ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. ఈ నెట్‌వర్క్ అనేక తీవ్రవాద కార్యకలాపాల్లో పాల్గొందని తెలిపారు. ప్రభుత్వ ప్రకటన ప్రకారం ఇది పాకిస్తాన్ ఆధారిత తీవ్రవాద సిండికేట్. భారత్‌లో గ్రెనేడ్ దాడులు, ఐఈడీలు, పెట్రోల్ బాంబులతో దాడులకు హత్యలకు అనుసంధానమై ఉంది. స్థానిక మధ్యవర్తులకు డబ్బు ఇచ్చి పోలీసు, రక్షణ, మత సంబంధిత ప్రాంతాలను సర్వే చేయించి గూఢచర్యం కోసం సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయించేది. స్వాతంత్ర్య దినోత్సవం చుట్టూ ఈ నెట్‌వర్క్ ప్లాన్ చేసిన దాడులను అడ్డుకోవడానికి ఆగస్టు 12న రాష్ట్ర పోలీసు దళాలతో రియల్ టైమ్ ఇంటెలిజెన్స్ పంచుకునే వ్యవస్థను ఉపయోగించి అనేక రాష్ట్రాల మధ్య సమన్వయంతో ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో 14 రాష్ట్రాల్లో 200 మందికి పైగా అరెస్టులు జరిగాయి. ఉత్తరప్రదేశ్‌లో 62 మందిని, హర్యానాలో 52, ఢిల్లీలో 51, పంజాబ్‌లో 44, రాజస్థాన్‌లో 15, మహారాష్ట్రలో 8, ఉత్తరాఖండ్‌లో 5, కర్ణాటక, గుజరాత్ బీహార్‌లో మూడేసి మందిని, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకాశ్మీర్, కేరళలో రెండేసి మందిని అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీ, కర్ణాటకలో కొత్త ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. మొత్తం మీద ఈ నెట్‌వర్క్‌పై 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, నెట్‌వర్క్‌కు చెందిన 200 మందికి పైగా సభ్యులను అరెస్టు చేశారు. ఉపా యాక్ట్, భారతీయ న్యాయ సంహిత ఆయుధాల చట్టం, మాదక ద్రవ్యాల చట్టం, పేలుడు పదార్థాల చట్టం కింద ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఐఈడీలు పాకిస్తాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ముద్రలు ఉన్న గ్రెనేడ్లు, పిస్తోళ్లు, లైవ్ కార్ట్రిడ్జ్‌లు, గూఢచర్యం కోసం ఉపయోగించిన సీసీటీవీ కెమెరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదు

మొదటి తరువాయి


ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని అధికారులకు సూచించారు. ఈ రెండు అంశాల్లో ఏ ఒక్కదానినీ నిర్లక్ష్యం చేసినా ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని హెచ్చరించారు. ఒక భూమి 22ఎ నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చిందనే విషయాన్ని అధికారులు సమగ్రంగా పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. సంబంధిత భూ రికార్డులు ఏమి చెబుతున్నాయి? నిషేధిత జాబితాలో చేర్చడానికి కారణాలు ఏమిటి? వాస్తవ పరిస్థితి ఏమిటి? అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. నిజమైన భూ హక్కుదారుడికి అన్యాయం జరగకుండా, అదే సమయంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. 22ఎ పేరుతో ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పడం, సమస్యల పరిష్కారంలో జాప్యం చేయడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని మంత్రి పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే స్వీకరించి పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిషేధిత భూముల సమస్యలపై ప్రజలు తమ ఫిర్యాదులను తెలియజేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా భూ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

# భారతీయులను వేటాడుతున్న ట్రంప్

మొదటి తరువాయి

ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐస్‌ఈ) అరెస్టులు, నిర్బంధాలు దేశం నుంచి వెనక్కి పంపించడంలో భారతీయులనే అత్యధికంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇమ్మిగ్రేషన్ క్రాక్‌డౌన్‌లో భాగం. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమెరికా 4,800 మందికి పైగా భారతీయులను స్వదేశానికి పంపించింది. ఈ సంవత్సరం మొదటి అర్ధభాగంలోనే 1,273 మందిని వెనక్కి పంపించారు. గత సంవత్సరం 3,567 మందిని పంపించారు అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. గత సంవత్సరం గణాంకాలు 16 సంవత్సరాలలో అత్యధికంగా ఉన్నాయి. జాతీయ స్థాయిలో జులైలో 51,000 మందిని ఐస్‌ఈ అరెస్టు చేసింది. ఇది కొత్త నెలవారీ రికార్డు. రోజుకు 2,000 అరెస్టులతో ట్రంప్ సరికొత్త రికార్డు సృష్టించారు. అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి మార్క్ వేన్ ముల్లిన్ ప్రకారం ఆగస్టు మొదటి వారంలో ఐస్‌ఈ సగటున 4,200 మందిని అరెస్టు చేసింది. కాబట్టి ఈ సంవత్సరం మిగిలిన కాలంలో మరింత మంది భారతీయులను అరెస్టు చేసి స్వదేశానికి తిరిగి పంపించే అవకాశం ఉంది.

# ఇరాన్‌తో చేతులు కలిపితే ఒమన్‌పై దాడి..



న్యూఢిల్లీ

మిత్రదేశమైన ఒమన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హెచ్చరిక జారీ చేశారు. హోర్ముజ్ జలసంధి తెరిచే విషయంలో ఇరాన్‌తో ఒమన్ చేతులు కలిపితే ఒమన్‌పై కూడా బాంబు దాడి చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌తో ఒమన్ దూరంగా ఉండాలని సూచించారు. గల్ఫ్ సంక్షోభం కొన్ని నెలలుగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇరాన్ యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధిని ఆ దేశం మూసేసింది. దీంతో ఒమన్ సహా పలు గల్ఫ్ దేశాలకు చెందిన చమురు రవాణా నిలిచిపోయింది. దీంతో ఒమన్ సహా అనేక గల్ఫ్ దేశాలు తీవ్రంగా నష్టపోతున్నాయిఇక, అమెరికా కూడా హోర్ముజ్ జలసంధిని దిగ్బంధించింది. ఈ నేపథ్యంలో ఒమన్‌కు తీవ్ర నష్టం వస్తుండటంతో తన వైఖరిలో మార్పు వచ్చింది. అమెరికాతో కలిసి ఉండటం కంటే ఈ విషయంలో ఇరాన్‌తో సంధి చేసుకోవడం బెటర్ అని భావిస్తోంది. ఇందుకోసం ఇరాన్‌తో కలిసి హోర్ముజ్ జలసంధిని తెరిచే అంశాన్ని పరిశీలిస్తోంది. జలసంధికి సంబంధించి ఒమన్ తీరం నుంచి ఎంట్రీ, హోర్ముజ్ నుంచి ఎగ్జిట్ వంటి అంశాల్ని పరిశీలిస్తోంది. రెండు దేశాలు కలిసి ఇక్కడి నౌకా మార్గాన్ని నియంత్రించాలని చూస్తున్నాయి. అంటే, అమెరికా నిర్ణయానికి వ్యతిరేకంగా ఇరాన్, ఒమన్ కలిసి.. హోర్ముజ్ జలసంధిని నిర్వహిస్తాయి. ప్రస్తుతం ఈ విషయం ఇంకా చర్చలు, ప్రతిపాదనల దశలోనే ఉంది. ఈ అంశమే ఇప్పుడు ట్రంప్ ఆగ్రహానికి కారణమైంది. హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్‌తో ఒమన్ ఒప్పందం కుదుర్చుకుంటే ఒమన్‌పై బాంబు దాడి చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్, హోర్ముజ్ విషయంలో తాము చేస్తున్న ప్రయత్నాలకు ఒమన్ అడ్డు తగలకూడదని వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీని ఎదుర్కొనేందుకు ఒక ప్రత్యేక, రహస్య ఛానెల్ ఏర్పాటు చేసినట్లు ట్రంప్ వెల్లడించారు. అలాగే, యుద్ధాన్ని త్వరగా ముగించాలనే ఆలోచన ఏదీ తమకు లేదని కూడా ట్రంప్ తేల్చిచెప్పాడు. ఇంతకాలం ఒమన్.. అమెరికాకు సహకరించింది. అయితే, ఇరాన్ యుద్ధం కారణంగా తీవ్ర నష్టం వాటిల్లడంతో అమెరికాతో ఉండటం వల్ల పెద్దగా ప్రయోజనం లేదని భావిస్తోంది. దీనికి బదులు నేరుగా ఇరాన్‌తోనే ఒప్పందం చేసుకుంటే మంచిదనే నిర్ణయానికి వచ్చింది. దీనిలో భాగంగా ఒమన్, ఇరాన్ చర్చలు జరుపుతున్నాయి.

# రాష్ట్రంలో రాబోయేది బిజెపి ప్రభుత్వమే

మొదటి తరువాయి

చెప్పదలుచుకున్నాను. మనందరికీ తెలిసిందే---భారత స్వాతంత్ర్య సమరంలో కోట్లాది మంది భారతీయులకు స్ఫూర్తినిచ్చిన నినాదం, గేయం 'వందే మాతరం' అని అన్నారు. వందే మాతరం ఆలాపన సందర్భంగా సోనియా గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనేతలు వ్యవహరించిన తీరు తీవ్ర వేదన కలిగిస్తోంది. వందే మాతరం ప్రారంభ చరణాలు ఆలాపించిన అనంతరం, పూర్తి గేయాన్ని కొనసాగించకుండా ఆపాలని సోనియా గాంధీ అసహనం వ్యక్తం చేసినట్లు కనిపించింది. రాహుల్ గాంధీ కూడా గేయాన్ని ముగించాలని సంకేతం ఇచ్చినట్లు కనిపించగా, చివరకు ఆలాపన కొనసాగించాలని వారికి చెప్పాల్సి వచ్చిందన్నారు. మనమందరం చూసిన ఆ దృశ్యాలు అత్యంత కలవరపరిచేవి. వందే మాతరం ఆలపిస్తున్న సమయంలో మల్లికార్జున ఖర్గే గారు, రాహుల్ గాంధీ గారు సహా కాంగ్రెస్ అగ్రనేతలు వ్యవహరించిన తీరును దేశ ప్రజలు గమనించారు. దేశం పట్ల, జాతీయ చిహ్నాల పట్ల, మన జాతీయ గేయానికి ఇవ్వాల్సిన గౌరవం పట్ల వారికి ఉన్న నిబద్ధతపై వారి ప్రవర్తన తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. కాంగ్రెస్ పార్టీకి దేశం కంటే ఒక కుటుంబమే ముఖ్యమన్న భావన వారి తీరుతో స్పష్టమవుతోందన్నారు. కేరళ అసెంబ్లీలో కూడా వందే మాతరం ఆలపించకపోవడం వంటి ఘటనలను మనం గమనించాలి. మన జాతీయ గేయాన్ని అవమానించే విధంగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరించడం అత్యంత దురదృష్టకరం, ఖండించదగ్గ విషయం అని ఆయన అన్నారు. దేశాన్ని విభజించాలని ప్రయత్నించే కొన్ని శక్తులు ఉన్నాయి. విద్యార్థులు, యువతను ప్రభావితం చేసి వారి ఆలోచనలను దేశ వ్యతిరేక దిశగా మళ్లించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అడవుల్లో నక్సలిజం తగ్గుముఖం పడుతున్న సమయంలో, మేధావుల ముసుగులో తిరిగే 'అర్బన్ నక్సల్స్' యువతను ప్రభావితం చేసి కొత్త తరాన్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మనం అప్రమత్తంగా ఉండాలి అని అన్నారు. అఫ్జల్ హమ్ షర్మిందా హై, తేరే ఖాతిల్ జిందా హై" వంటి నినాదాలు, దేశాన్ని ముక్కలు చేయాలనే భావజాలాన్ని ప్రోత్సహించే ప్రయత్నాలు అత్యంత ఆందోళనకరం. దేశ ఐక్యత, సమగ్రతను దెబ్బతీయాలని చూస్తున్న 'తుక్డే–తుక్డే' భావజాలాన్ని పెంచిపోషించే శక్తులను మనం గుర్తించాలి. వారు భారత్‌ను విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తున్నారు---ఈ విషయాన్ని ముఖ్యంగా యువత అర్థం చేసుకుని, గుర్తించాలన్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలోనే ఈరోజు ఇంత పెద్ద సంఖ్యలో మీరు భారతీయ జనతా పార్టీలో చేరడం నాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. దేశ ఐక్యత, జాతీయత, దేశ అభివృద్ధి కోసం ముందుకు వచ్చి బీజేపీలో చేరుతున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక స్వాగతం పలికారు.

# పరుగులు తీస్తున్న ప్రతిభ... విజయతీరాల వైపు క్రీడాకారుల పయనం!




●నాగర్ కర్నూల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్ విజయవంతం
●కల్వకుర్తి డిఎస్పి వెంకట్ రెడ్డి మరియు బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు

**మిడ్జిల్, ఆగస్టు 17 (నేటి దర్శిని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
వచ్చే నెల 26, 27 తేదీల్లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరగనున్న 12వ తెలంగాణ స్టేట్ సౌత్ జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ కోసం నాగర్ కర్నూల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కల్వకుర్తి జయప్రకాశ్ నగర్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల



పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 250 మందికి పైగా క్రీడాకారులు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ విషయాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు తెలిపారు. ఈ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్‌ను కల్వకుర్తి డీఎస్పీ వెంకట్ రెడ్డి మరియు బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు, క్రీడాకారులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ప్రతిరోజూ 24 గంటల్లో కనీసం ఒక గంట సమయాన్ని వ్యాయామం, క్రీడలకు కేటాయించాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించి నాగర్ కర్నూల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు మరియు బహుమతులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు భిక్షపతి, పీడీలు ప్రసాద్, బాలయ్య, చంద్రశేఖర్, మల్లేష్, బాలుసు, మల్లేష్, లక్ష్మి, జ్యోతి, లాలమ్మ తదితరులు పాల్గొన్నారు.




# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

●ప్రజావాణికి 93 పిర్యాదుల స్వీకరణ.
●ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.




బ్రహ్మ కుమరీల ద్వారా వ్యసన ముక్త్ భారత్ ప్రతిజ్ఞ



**మిడ్జిల్, ఆగస్టు 17, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.
ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. భూ సమస్యలు, రెవెన్యూ, పింఛన్లు, సంక్షేమ పథకాలు, ఉపాధి, రహదారులు, తాగునీరు, గృహ నిర్మాణం తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజలు సమర్పించారు. ప్రజావాణిలో 93 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు.
ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతికి ప్రాధాన్యతనిస్తూ, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి, సంబంధిత దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు.
ప్రజావాణి ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువస్తున్నందున, వాటి పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

**‘వ్యసన ముక్త్ భారత్’ కోసం అధికారులతో బ్రహ్మకుమారీల ప్రతిజ్ఞ**

ప్రజావాణి కార్యక్రమం అనంతరం బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ‘వ్యసన ముక్త్ భారత్’ ప్రచారంలో భాగంగా జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీల ప్రతినిధులు మాట్లాడుతూ, వ్యసన ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 10 కోట్ల మందితో ప్రతిజ్ఞ చేయించాలనే లక్ష్యంతో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 6 నుంచి 20వ తేదీ వరకు దాది ప్రకాశ్‌మణి స్మారకార్థం రక్తదాన శిబిరాలు, వ్యసన విముక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మద్యం, పొగాకు, మాదకద్రవ్యాలతో పాటు మొబైల్ ఫోన్, స్క్రీన్ వినియోగం, ప్రతికూల ఆలోచనలు, పనులను వాయిదా వేయడం వంటి అలవాట్లు కూడా వ్యసనాలుగా మారుతున్నాయని తెలిపారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ సానుకూల ఆలోచనలు, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. వ్యసన ముక్త్ మహబూబ్‌నగర్, వ్యసన ముక్త్ తెలంగాణ, వ్యసన ముక్త్ భారత్ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**సెన్సస్ వివరాలను ఈ నెల 20లోగా అందించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

అనంతరం, జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, జిల్లాలో సెన్సస్ హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ స్టేజ్-1 విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. తదుపరి దశ సెన్సస్ ప్రక్రియలో భాగంగా జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ కోరకు అవసరమైన సమాచారాన్ని శాఖల వారీగా వివరాలను నిర్దేశిత ఫార్మాట్‌లో సేకరిస్తున్నట్లు చెప్పారు. 31 సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్లు తమ పరిధిలోని వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి ఈ నెల 20లోగా జిల్లా ప్రణాళిక శాఖకు పంపించాలని ఆదేశించారు. సెన్సస్‌కు సంబంధించిన రికార్డులు, ఫైళ్లను భద్రంగా ఉంచాలని సూచించారు. సెన్సస్ ప్రక్రియ విజయవంతంగా పూర్తిచేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంరెడ్డి, డి.ఆర్.డి.ఓ. నర్సింహులు, జిల్లా ప్రణాళిక శాఖ ఇంచార్జి అధికారి బి. నర్సింహులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జీరో సర్వే నంబర్‌తో రైతుకు అందని ప్రభుత్వ ప్రయోజనాలు



**మిడ్జిల్, ఆగస్టు 17, (నేటి దర్శిని):**
మిడ్జిల్ మండలం వాడ్యాల గ్రామ శివారులో జీరో సర్వే నంబర్‌లో నమోదైన రెండెకరాల భూమికి పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేయాలని గ్రామానికి చెందిన గజ్జల రాజేష్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.
ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో తమ కుటుంబానికి గ్రామ శివారులో రెండెకరాల భూమిని కేటాయించినట్లు రాజేష్‌కుమార్ తెలిపారు. అప్పటి నుంచి భూమిలో బోరుబావి ఏర్పాటు చేసుకుని వరి సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నామని పేర్కొన్నారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ధరణి పోర్టల్‌లో భూమి జీరో సర్వే నంబర్‌గా నమోదు కావడంతో పట్టాదారు పాస్‌బుక్ మంజూరు కాలేదన్నారు. పాస్‌బుక్ లేకపోవడంతో బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నామని, రుణమాఫీతో పాటు పలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పరిశీలించి జీరో సర్వే నంబర్ సమస్యను పరిష్కరించి పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేయాలని తహసీల్దార్‌ను కోరారు.

# మార్నింగ్ వాక్ తో సమస్యల పరిష్కారానికి కృషి

● మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్



**ఆమనగల్లు,ఆగస్టు17(నేటి దర్శిని):**
సమస్యల పరిష్కారానికి మార్నింగ్ వాక్ నిర్వహిస్తున్నట్లు మున్సిపాలిటీ చైర్మన్ పత్య నాయక్ అన్నారు. సోమవారం ఆమనగల్లు మున్సిపాలిటీ లోని 13వ వార్డు కౌన్సిలర్ అనూష శ్రీశైలం తో కలిసి వార్డులో పర్యటించారు. కాలనీలో పర్యటిస్తూ,ప్రజలను కలుసుకొని,వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సమస్యలు,చెత్త తొలగింపు,డ్రైనేజీ అంశాలపై ప్రజల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో కలిసి పారిశుద్ధ్య పనులను పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, రామకృష్ణ,సురేష్, కాలనీవాసులు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లిలో భారీగా ఇసుక నిల్వలు సీజ్..




**మిడ్జిల్, ఆగస్టు 17, (నేటి దర్శిని ):**
మిడ్జిల్ మండలం కొత్తపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 15,829 క్యూబిక్ మీటర్ల ఇసుకను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన ఇసుకను ప్రభుత్వ నిబంధనల ప్రకారం బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు అధికారులు నిర్ణయించారు. ఆగస్టు 20న ఉదయం 11 గంటలకు మిడ్జిల్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.10 వేల డీడీని ‘ది సాండ్ మేనేజ్‌మెంట్ సొసైటీ, మహబూబ్‌నగర్’ పేరిట తీసి, ఆగస్టు 19న సాయంత్రం 5 గంటలలోగా మిడ్జిల్ తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.


# వృద్ధులకు అండగా లయన్స్ క్లబ్ కంటి వైద్య శిబిరాలు



**ఆమనగల్లు, ఆగస్టు17(నేటి దర్శిని);**
లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, రామ్ రెడ్డి లయన్ ఐ హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టణంలోని లయన్ రామ్ రెడ్డి విజన్ సెంటర్లో నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతమైందని క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. కంటి వైద్యులు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ ఎం చంద్రశేఖర్ 65 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 32 మందికి రామ్ రెడ్డి లయన్స్ ఆసుపత్రికి తరలించినట్లు క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ సందర్భంగా ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ కంటి వైద్య శిబిరాలు వృద్ధులకు, కంటి చూపు మందగించిన వారికి ఎంతో దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరు తమ కండ్లను దానం చేయడానికి ముందుకు రావాలని ఆయన కోరారు. సుచి శుభ్రత పాటించి కళ్ళను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ బి యాదయ్య,లయన్స్ క్లబ్ సభ్యులు కర్నాటి కొండల్ రెడ్డి,శిరీష ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# ప్రశ్నపై కొత్త కుట్ర!




కుక్కను చంపాలనుకున్నప్పుడు దానిపై మోపే నెపం పిచ్చి. ఢిల్లీ ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్ర మోడీ నోట దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో హఠాత్తుగా 'దిమాగీ నక్సల్స్' కూడా సదరు 'పిచ్చి' సాకు కిందికే వస్తుంది. తమను ప్రశ్నించే వారి గొంతులను నొక్కేసేందుకు ఎంచుకున్న ఎత్తుగా కనిపిస్తుంది. ఈ అంచనా గత పన్నెండేళ్ల బీజేపీ పాలనలో దేశం చవి చూసిన అనుభవాల నుంచి వస్తుంది. అడవుల్లోని సాయుధ నక్సలైట్లను నిర్మూలించడంలో విజయం సాధించినప్పటికీ, మావోయిస్టు భావజాలం కలిగిన వారు సమాజంలో పాతుకుపోయి ఉన్నారని, వారే దేశానికి కొత్త శత్రువులని, అటువంటి వారితోనే ముప్పు పొంచి ఉందని ప్రధాని పేర్కొనడం వెనుక అణచివేత ప్రణాళికకు రూపకల్పన జరుగు తోందన్న అనుమానాలు బయలు దేరాయి. అక్కడితో ఆగకుండా దిమాగీలను గుర్తించి ఏకాకులను చేయాలనీ ప్రధాని అన్నారు. ఇప్పటివ రకు మోడీ, ఆయన పార్టీ బీజేపీ పలు సందర్భాల్లో ప్రతిపక్షాలను, ప్రజా ఉద్యమకారులను, పౌర హక్కుల కార్యకర్తలను, ప్రభుత్వ విధానాలపై ప్రశ్నించే వారిని, నిరసన తెలిపే వారిపై అనేకానేక అభియోగాలు మోపు తున్నారు.

దేశద్రోహులు, జాతి వ్యతిరే కులు, ఆటంక వాదులు, ఉగ్ర వాదులు, తీవ్రవాదులు, మావో యిస్టులు అనే ముద్ర వేసి కేసులతో వేధించి నానా ఇబ్బందులు పెడుతు న్నారు. ఇంకో అడుగు ముందుకేసి ప్రభుత్వాన్ని పార్ల మెంట్‌లో, వెలుపల నిరసన తెలిపిన ప్రతిపక్ష నేతలను అర్బన్ నక్సల్స్ అని సంభోధించారు. ఈ పూర్వరంగంలో ఏకంగా దిమాగీ నక్సల్స్ అనే వరకు వెళ్లారంటే కచ్చితంగా నిరంకుశ ఎజెండా దాగి ఉంటుందన్నది స్పష్టం. ప్రధాని 'దిమాగీ నక్సల్స్' వ్యాఖ్యలపై సర్వత్రా ఆగ్రహం వెల్లువెత్తడంతో నష్ట నివారణకు ప్రభుత్వం తరఫున న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇచ్చిన వివరణ మరిన్ని సందేహాలను రేపింది. మావోయి స్టులకు మద్దతిచ్చేవారు, వేర్పాటు వాదులు, భారత రాజ్యాంగాన్ని తిరస్కరించే వారు, ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకించే వారే దిమాగీ నక్సల్స్‌గా చెప్పుకొచ్చారు. అయితే ఈ ఆర్టికల్‌ను వ్యతిరేకించే వారందరూ మేధో నక్సలైట్ల యితే ప్రతి పక్షాలు దిమాగీ నక్సల్స్ అవుతారా? వాస్తవానికి అంబేద్కర్ రచించిన రాజ్యాం గాన్ని తిరస్క రించింది బీజేపీ మాతృక ఆరెస్సెస్, పరివారం. చెప్పాల్సి వస్తే ఆ సంస్థలే జాతి విద్రోహులవుతాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చాక, ఆ పార్టీ పాలిత రాష్ట్రాలలో రాజ్యం అసహనం అనేక మార్లు బయట పడింది. ఉపా, రాజద్రోహం, వంటి అనేక తీవ్రాతి తీవ్రమైన కేసులను, నిర్బం ధాలను హక్కుల కార్యకర్తలు, ప్రజా ఉద్యమ కారులు, ప్రొఫెసర్లు, మేధావులు, కవులు, కళాకారులు ఎదుర్కొన్నారు. కొరేగావ్ కేసు అందుకు ప్రత్యక్ష ఉదాహరణ.

హిందూ ఉన్మాదుల చేతుల్లో పన్సారే, దబోల్కర్, కల్బుర్గి, గౌరీ లంకేశ్ వంటి వారు హత్యకు గురయ్యారు. మరెందరో దాడులను చవిచూశారు. జెన్-జీ ఆందోళనలతో దిమ్మ తిరిగిన మోడీ ప్రభుత్వం, భవిష్యత్తులో ఇటువంటి పోరాటాలపై ఉక్కుపాదం మోపేందుకు సౌకర్యవంతమైన 'దిమాగీ నక్సల్స్' అనే పదాన్ని కనిపెట్టినట్లు విదితమవుతుంది. పౌర స్వేచ్ఛకు సంకెళ్లుగా చూడాలి. ప్రభుత్వ నిరంకుశ చర్యలను రాజ్యాంగ ప్రేమికులు, ప్రజాస్వామిక వాదులు, పార్టీలు, ప్రతి ఒక్కరూ ఖండించాలి. దిమాగీ నక్సల్స్' అంటూ ప్రధాని చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ పరిహాసానికి కూడా దారితీశాయి. ఇప్పటికే యువతలో వ్యంగ్యంగా 'కాక్రోచ్ జనతా పార్టీ' వంటి పేర్లు వినిపిస్తుండగా, తాజాగా 'దిమాగీ నక్సల్ పార్టీ' పేరుతో సోషల్ మీడియాలో కొత్త రాజకీయ వ్యంగ్య వేదిక తెరపైకి వచ్చింది. అంటే, పాలకులు విమర్శకులకు పెట్టిన ముద్రలే తిరిగి పాలకులపై వ్యంగ్యాస్త్రాలుగా మారుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వాన్ని విమర్శించిన వారిని 'దిమాగీ నక్సల్స్'గా ముద్రించే ధోరణి కొనసాగితే రేపటి ప్రజాస్వామిక అసమ్మతికి ఎలాంటి పేరు పెడతారన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన పాలక వ్యవస్థ, ప్రశ్నించే ప్రజలకే కొత్త కొత్త ముద్రలు వేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. పాలకులు ప్రజల అసమ్మతిని అణచడం కంటే వారి ప్రశ్నలకు సమాధానం చెప్పడం ముఖ్యం. వారు జవాబు చెప్పనంత కాలం 'కాక్రోచ్' అయినా, 'దిమాగీ' అయినా పేర్లు మారుతాయి కానీ, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు మాత్రం శాశ్వతం.

# ఐఎస్ఐ అనుకూల షాహజాద్ భట్టి నెట్‌వర్క్ గుట్టురట్టు..

**తెలంగాణ సహా వివిధ రాష్ట్రాల నుంచి 200 మంది అరెస్ట్**

న్యూఢిల్లీ : (నేటి దర్శిని)
దేశంలో భారీ కుట్రకు ప్లాన్ చేస్తున్న ఉగ్ర నెట్‌వర్క్‌ను భద్రతా బలగాలు అంతం చేశాయి. ఈ ముఠాకు చెందిన దాదాపు 200 మంది సభ్యుల్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాయి. దీనికి సంబంధించిన వివరాల్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. మోదీ ప్రభుత్వం ఉగ్ర నెట్‌వర్క్‌ను నాశనం చేసిందని షా అన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) సహా వివిధ భద్రతా బలగాల సాయంతో ఉగ్ర నెట్‌వర్క్ ముఠాను పట్టుకున్నారు.షాహజాద్ భట్టి నెట్‌వర్క్ (ఎస్‌బీఎన్) అనే సంస్థ పాకిస్తాన్‌కు చెందిన ఉగ్ర సంస్థ ఐఎస్ఐకి అనుకూలంగా పని చేస్తుంది. ఈ సంస్థలో 200 మంది వరకు సభ్యులు ఉన్నారు. వీరంతో దేశంలో భారీ కుట్రకు ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే ఈ సభ్యులు పోలీసులు, రక్షణకు సంబంధించిన




ప్రదేశాలు, మతపరమైన ప్రదేశాల్లో రెక్కీ నిర్వహించారు. పలు చోట్ల నిఘా కోసం సీసీటీవీ కెమెరాల్ని కూడా ఏర్పాటు చేశారు. సంబంధిత సమాచారాన్ని పాకిస్తాన్‌కు చేరవేస్తున్నారు. అయితే, ఎస్‌బీఎన్ కుట్రను భారత నిఘా విభాగం, భద్రతా బలగాలు ఛేధించాయి. వివిధ రాష్ట్రాల్లో ఉన్న నెట్‌వర్క్ సభ్యుల్ని అరెస్టు చేశాయి. ఇందుకోసం ఆగష్టు 15న అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి సమన్వయంతో దాడులు నిర్వహించారు. అన్ని రాష్ట్రాల అధికారులు, సెంట్రల్ ఏజెన్సీస్ కలిపి దాడులు చేసి వివిధ రాష్ట్రాల్లో దాదాపు 200 మందిని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి ఐఈడీలు, గ్రెనేడ్లు, పిస్టల్స్, లైవ్ క్యాట్రిడ్జెస్, సీసీటీవీ కెమెరాలు వంటి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాటిపై పాకిస్తాన్ మార్క్ ఉన్నట్లు గుర్తించారు. ఇక అనేక ఉగ్ర కార్యాకలాపాల్లో ఈ ముఠా పాల్గొన్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. తమ ప్రభుత్వం తీవ్రవాదాన్ని ఎంతమాత్రం సహించబోదని ఆయన అన్నారు. అరెస్టు అయిన వారిపై ఉపా సహా వివిధ చట్టాల కింద కేసు నమోదు చేశారు. వీరిలో యూపీ నుంచి 62 మంది, ఢిల్లీ నుంచి 51 మంది, పంజాబ్ నుంచి 44 మంది, రాజస్థాన్ నుంచి 15 మంది, మహారాష్ట్ర నుంచి 8 మంది, ఉత్తరాఖండ్ నుంచి 5గురు, కర్ణాటక, బిహార్, గుజరాత్ నుంచి ముగ్గురు చొప్పున, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ అండ్ కాశ్మీర్, కేరళ నుంచి ఇద్దరు అరెస్టయ్యారు. వీరందరిపై ఢిల్లీ, కర్ణాటకల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. దాదాపు 80 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

# తృటిలో తప్పిన పెను ప్రమాదం..!

**షెడ్యూలింగ్‌లో లోపంతో ఒకే లైన్‌లోకి రెండు ఫ్లైట్‌లు..**

న్యూఢిల్లీ : (నేటి దర్శిని)
ఆకాశంలో అమెరికన్ ఎయిర్‌లైన్స్ కు చెందిన రెండు విమానాలకు పెను ప్రమాదం తప్పింది. రెండింటికి ఒకటే నంబర్ ఉండటంతో అవి ఒకే మార్గంలోకి వచ్చి దాదాపు ఢీకొన్నంత పని అయ్యింది. అయితే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. అమెరికాలోని ఆరిజోనా రాష్ట్రం ఫీనిక్స్ ప్రాంతంలో అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండు విమానాలు గాల్లో ఎదురెదురుగా వచ్చాయి. ఫీనిక్స్ స్కైహార్బర్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన జరిగింది. అందులో





ఒక బోయింగ్ విమానం షికాగో నుంచి వస్తుండగా.. మరో విమానం అప్పుడే ఫీనిక్స్ నుంచి బయల్దేరింది. రెండింటికి ఒకటే ఫ్లైట్ నంబర్ ఉండటం (అమెరికన్ 2482), ప్రతికూల వాతావరణంవల్ల షికాగో విమానం ఆలస్యం కావడం రెండు విమానాలు ఒకే లైన్‌లోకి రావడానికి కారణమయ్యాయి. వేర్వేరు మార్గాల్లో వెళ్లే విమానాలకు ఎయిర్‌లైన్స్ ఇలా ఒకే నంబర్ ఇవ్వడం సాధారణమే. అయితే ఒకే కాల్ సైన్ ఉన్న విమానాలు ఒకే సమయంలో ఒకే ప్రదేశంలో ఉండటం మాత్రం అరుదుగా జరుగుతుంది. షెడ్యూలింగ్ పొరపాటు కారణంగా ఇలాంటి ఘటన చోటుచేసుకుంది. అయితే ఈ అసాధారణ పరిస్థితిని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ గుర్తించారు. అరైవల్, డిపార్చర్‌లో ఉన్న విమానాలకు వెంటనే వేర్వేరు సూచనలు చేశారు. అరైవల్‌లో ఉన్న విమానాన్ని ఎక్కువ ఎత్తు తీసుకోమని, డిపార్చర్‌లో ఉన్న విమానాన్ని తక్కువ ఎత్తులో ప్రయాణించమని సూచించారు. ఆ సూచనకు తగ్గట్టుగానే పైలట్లు తమతమ మార్గాలను మార్చుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. తాను 25 ఏళ్లుగా ఈ విధులు నిర్వర్తిస్తున్నానని, ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదని కంట్రోలర్ చెప్పారు. అయితే ఈ భద్రతాలోపంపై దర్యాప్తు జరుగుతున్నది.

# ఇరాన్‌పై అణుదాడులకు ట్రంప్ సన్నద్ధత..

**రిపబ్లికన్ పార్టీ నాయకురాలు సంచలన వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ : (నేటి దర్శిని)
ఇరాన్-అమెరికా దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా కాంగ్రెస్ మాజీ సభ్యురాలు, రిపబ్లికన్ పార్టీ నాయకురాలు మర్జోరీ టేలర్ గ్రీన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధాలను నియంత్రించడమే తమ లక్ష్యమని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బయటకు చెప్తున్నప్పటికీ.. ఇరాన్‌పై అణుదాడులు ప్రారంభించడానికి రహస్యంగా సన్నద్ధమవుతున్నారని వ్యాఖ్యానించారు. త్వరలో ఈ అణుదాడులు చేయడానికి ట్రంప్ యంత్రాంగం ప్రణాళికలు రచిస్తోందని ఇందుకోసం ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారులు వ్యూహాత్మక సమావేశాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ అణుదాడులవల్ల ప్రపంచం మొత్తం పెద్ద సంఘర్షణలోకి ఆర్థిక మాంద్యంలోకి వెళ్లే



ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రజలు ముందుకు వచ్చి ఆయన చర్యలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 1945లో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అణ్వాయుధాలను ప్రయోగించిన విషయాన్ని టేలర్ గ్రీన్ గుర్తుచేసుకున్నారు. ఇన్నేళ్లు గడిచినా జపాన్ ప్రజలు ఇప్పటికీ రేడియేషన్ వ్యాధులు, క్యాన్సర్, పుట్టుకతో సంక్రమించే లోపాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదే పరిస్థితి ఇరాన్‌కు కూడా ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. యుద్ధం జరుగుతున్నంత కాలం ప్రజలు భయపడుతూనే జీవించాల్సి ఉంటుందని ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖతామీ పేర్కొన్నారు. ఈ పరిస్థితులు తొలగిపోయి శాంతియుత వాతావరణం నెలకొనేలా దౌత్య విధానాలను అవలంభించాలని ప్రభుత్వానికి సూచించారు. ఇన్నాళ్లు బాహ్య ఒత్తిడిని తట్టుకొని ప్రభుత్వం నిలబడినప్పటికీ యుద్ధ పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందన్నారు. మరోవైపు అమెరికా, ఇజ్రాయెల్ వద్ద అణ్వాయుధాలు ఉన్నంతవరకు ఇరాన్ కూడా వాటిని సమకూర్చుకుంటూనే ఉంటుందని ఆ దేశ సీనియర్ కమాండర్ జనరల్ అహ్మద్ వాహిది పేర్కొన్నట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి.

# దినదిన గండంగా..

**-గడువు తీరిన కాల్పుల విరమణ ఒప్పందం**
**-పొడిగింపు ప్రశ్నే లేదు... విజయం మాదే : ఇరాన్**
**-తాజా శాంతి చర్చలపై అనుమానాలు**

టెహ్రాన్ : (నేటి దర్శిని)
మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించే ఉద్దేశంతో అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం (ఇస్లామాబాద్ ఎంఓయూ) గడువు సోమవారం ముగిసింది. ఒప్పందాన్ని పొడిగించేందుకు చర్చలేవీ జరగడం లేదని ఇరాన్ వర్గాలు ఇప్పటికే స్పష్టం చేశాయి. యుద్ధాన్ని అన్ని రకాలుగా ముగించేందుకు, సైనిక చర్యలను తక్షణమే శాశ్వతంగా నిలిపివేసేందుకు ఉద్దేశించిన అవగాహనా ఒప్పందంపై జూన్‌లో అమెరికా, ఇరాన్ సంతకాలు చేసిన విషయం తెలిసిందే. అయితే అప్పటి నుంచి ఒప్పందం మనుగడ ప్రతి రోజూ దినదిన గండంగానే గడిచింది. గత నెల 7వ తేదీన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ ప్రకటన చేస్తూ ఒప్పందం ముగిసిందని ప్రకటించారు. మరోవైపు ఎంఓయూలో ఇచ్చిన హామీలను అమెరికా పదే పదే ఉల్లంఘిస్తోందని ఇరాన్ ఆరోపిస్తోంది. తాత్కాలిక ఒప్పందం కుదిరిన 48 గంటల లోనే అమెరికా దానిని ఉల్లంఘిం చిందని,



ఆ తర్వాత కొద్ది రోజులకే ఒప్పందం నుంచి వైదొలిగిందని ఇరాన్ వర్గాలు తెలియ జేశాయి. అందుకే ఒప్పందం పొడిగింపుపై చర్చలు జరపడం లేదని చెప్పాయి.

**పొడిగింపు ప్రశ్నే లేదు : అరాగ్చీ**

కాల్పుల విరమణను పొడిగించే ప్రశ్నే లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. ఎంఓయూను ఉల్లంఘిస్తున్న అమెరికా తమ పై దాడులు చేస్తూనే ఉన్నదని ఆరోపించారు.

తుది ఒ ప్పందంపై చర్చలకు అవకాశం కల్పించేందుకే ఎంఓ యూను కుదుర్చుకున్నాం తప్ప దానిని కాల్పుల విరమణకు గడువుగా భావించలేదని చెప్పారు. కాగా ఇరాన్ ఇటీవల తన జాతీయ భద్రతా యంత్రాంగాన్ని ప్రక్షాళన చేసింది. భవిష్యత్తులో జరిగే చర్చలకు ఇరాన్ అనుసరించబోయే కఠిన వైఖరిని ఇది సూచిక అని పరిశీలకులు తెలిపారు. అమెరికాతో రాజీ పడేందుకు ఇరాన్ ఏ మాత్రం సుముఖంగా లేదు. ముఖ్యంగా హొర్ముజ్ జలసంధి విషయంలో తన పట్టు వీడడం లేదు.

**పూర్తి విజయం సాధించాం :? ఘలీబఫ్**

అమెరికా, ఇజ్రాయిల్ దేశాలపై తాము పూర్తి విజయం సాధించామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, చర్చల ప్రతినిధి మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్ తెలిపారు. ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించే సమయంలో తాము నిర్దేశించుకున్న తొమ్మిది లక్ష్యాలలో ఏ ఒక్క దానినీ ఆ దేశాలు సాధించలేకపోయాయని ఎద్దేవా చేశారు. సైనిక, రాజకీయ కోణాలలో తమదే విజయమని చెప్పారు. అయితే దీనర్థం అమెరికా లేదా ఇజ్రాయిల్ సేనలను భౌతికంగా నిర్మూలించినట్లు కాదని వివరణ ఇచ్చారు. 'అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు నిర్దిష్ట, స్పష్టమైన లక్ష్యాలతో మాపై దాడి చేశాయి. ఆ లక్ష్యాలను వారు అధికారికంగా ప్రకటించారు. లిఖితపూర్వకంగా తెలియజేశారు. అయితే ఏ స్థాయిలోనూ వాటిని సాధించలేకపోయారు. ఇది అమెరికా, ఇజ్రాయిల్ దేశాలకు అతి పెద్ద, ఘోర పరాజయం' అని వివరించారు. ఇదిలావుండగా అమెరికా-ఇజ్రాయిల్ సేనలను పూర్తిగా ఓడిస్తామని, మధ్యప్రాచ్యంలో శత్రువులు పూర్తిగా మట్టికరిచే వరకూ వెనుదిరిగే ప్రశ్నే లేదని ఇరాన్ సైన్యం ప్రకటించింది.

# ఘనంగా భక్తి శ్రద్ధలతో నాగదేవతలకు పూజలు



**ఆమనగల్లు,ఆగస్టు17 (నేటి దర్శిని):** నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణంలోని అంగడి బజారు హనుమాన్ దేవాలయంలో నాగదేవతలకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ సంఘ సేవకులు,5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి శ్వేతా రాము దంపతులు ఆలయానికి చేరుకుని నాగదేవతలకు ప్రత్యేక పూజలు చేసి పాలాభిషేకం నిర్వహించారు.అనంతరం భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.నాగుల పంచమి పర్వదినం సందర్భంగా ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని పాపిశెట్టి శ్వేతా రాము దంపతులు ఆకాంక్షించారు.ఆలయంలో ప్రత్యేక పూజల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నాగదేవతలను దర్శించుకుని పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాపిశెట్టి కల్యాణి,అరవింద్‌తో పాటు ఆలయ అర్చకులు, భక్తులు,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ..

- ఎస్పీ డి.జానకి



**మిడ్జిల్, ఆగస్టు 17 (నేటి దర్శిని, మహబూబ్‌నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను ఎస్పీకి ప్రత్యక్షంగా వివరించి వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రతి బాధితుడి సమస్యను సావధానంగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఫిర్యాదులపై అవసరమైన విచారణ చేపట్టి, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా, చట్టబద్ధమైన విధానంలో విచారణ నిర్వహించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి, సమస్యకు తగిన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ డి. జానకి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఆర్టీసీ డ్రైవర్, శ్రామిక్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ

- పరిశీలించిన జిల్లా ఎస్పీ డి.జానకి ఐపిఎస్



**మిడ్జిల్, ఆగస్టు 17, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని జిల్లాలకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ మరియు శ్రామిక్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రక్రియలో మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 21 మంది, నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి 21 మంది, వనపర్తి జిల్లా నుంచి 14 మంది, గద్వాల జిల్లా నుంచి 14 మంది, నారాయణపేట జిల్లా నుంచి 14 మంది అభ్యర్థులు కలిపి మొత్తం 84 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నారు. వీరిలో 64 మంది డ్రైవర్ పోస్టులకు, 20 మంది శ్రామిక్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ఉన్నారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతున్నది జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ప్రక్రియను పరిశీలించారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియ పరిశీలించి, ప్రక్రియను సక్రమంగా నిర్వహించేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్.అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఏ.ఓ. రుక్మిణీ భాయ్, ఆర్.ఐ లు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.'

# గ్రామాల్లో కొత్త మీ సేవా కేంద్రాల ఏర్పాటు

- 17వ తేదీ నుండి దరఖాస్తుల ఆహ్వానం: జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్
- ఉద్యోగ అవకాశాలతో పాటు ప్రభుత్వ సేవలు సులభతరం.




**నల్గొండ, ఆగస్టు17(నేటి దర్శిని):** డిజిటల్ పాలనను గ్రామీణ ప్రాంతాలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో నల్గొండ జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని మారుమూల గ్రామాల ప్రజలు సైతం ప్రభుత్వ సేవలను సులభంగా పొందేందుకు వీలుగా చిట్యాల మండలం ఉరుమడ్ల, శాలిగౌరారం మండలం తక్కెళ్ళపహాడ్ గ్రామాల్లో కొత్తమీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సి.చంద్రశేఖర్, నిర్ణయించారు.ఈ మేరకు ఆయా గ్రామాల్లో మీసేవ కేంద్రాలను నిర్వహించడానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తూ శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.

**గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు-లక్ష్యం అదే..**

రెవెన్యూ,రిజిస్ట్రేషన్,విద్య, ఆరోగ్యం తదితర ప్రభుత్వ శాఖల సేవలను ఒక్కచోటనే అందించే మీ సేవా కేంద్రాలు గ్రామీణ ప్రజలకు వరంగా మారాయి.మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి వెళ్లి గంటల తరబడి క్యూలలో నిలబడకుండా తమ గ్రామంలోనే కుల,నివాస, ఆదాయ ధృవీకరణ పత్రాలు, పింఛన్లు,పాస్‌పోర్ట్ దరఖాస్తులు,వివిధ పథకాలకు దరఖాస్తులు చేసుకునే వెసులుబాటును ఈ కేంద్రాలు కల్పిస్తున్నాయి. “ప్రభుత్వ సేవలు ప్రజల గడప వద్దకు తీసుకువెళ్లడమే మా లక్ష్యం. ప్రతి గ్రామంలో మీసేవ కేంద్రం ఉంటేనే ఈ లక్ష్యం సాధ్యమవుతుంది “అని కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ప్రస్తుతం జారీ చేసిన ప్రకటన ప్రకారం రెండు గ్రామాల్లో కొత్తగా కేంద్రాలు రానున్నాయి. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామం, శాలిగౌరారం మండలం తక్కెళ్ళపహాడ్ గ్రామం.ఈ రెండు గ్రామాలు చుట్టుపక్కల 8-10 గ్రామాలకు కేంద్రంగా ఉన్నాయి.దీంతో సుమారు 15 వేల మంది జనాభాకు ప్రత్యక్ష ప్రయోజనం కలగనుంది. మీసేవ కేంద్రాన్ని నిర్వహించాలనుకునే వారు తప్పనిసరిగా కింది అర్హతలు కలిగి ఉండాలి.విద్యార్హత కనీసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత,డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత ఉంటే మంచిది.అలాగే కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి.దరఖాస్తు చేసుకునే నాటికి 21 సంవత్సరాల నుండి 44 సంవత్సరాల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ,ఎస్టీ,బీసీ అభ్యర్థులకు వయో సడలింపు ఉంటుంది. దరఖాస్తు చేసుకునే వ్యక్తి సంబంధిత మండలానికి చెందిన స్థానిక నివాసి అయి ఉండాలి.దీనికి సంబంధించి నివాస ధృవీకరణ పత్రం సమర్పించాలి.మీ సేవ కేంద్రాన్ని నిర్వహించడానికి సొంతంగా లేదా లీజు ప్రాతిపదికన ఫ్లాట్/షాప్ ఉండాలి.కంప్యూటర్, ప్రింటర్, ఇంటర్నెట్, స్కానర్,యుపిఎస్ వంటి పరికరాలు సమకూర్చుకోవాలి. దరఖాస్తుదారుపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని రుజువు చేసే పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ సమర్పించాలి.దరఖాస్తుల స్వీకరణ అనంతరం అర్హులైన అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహిస్తారు.ఈ పరీక్షలో కంప్యూటర్ పరిజ్ఞానం, జనరల్ నాలెడ్జ్,గణితం, తెలుగు,ఇంగ్లీష్ నుండి ప్రశ్నలు ఉంటాయి.రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి మౌఖిక పరీక్ష/ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.రెండింటిలో వచ్చిన మార్కుల ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ఎంపికైన వారికి మీసేవ సాఫ్ట్‌వేర్ పై ప్రత్యేక శిక్షణ ఇస్తారు.ఆసక్తి ఉన్న అభ్యర్థులు నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మీసేవ విభాగం నుండి దరఖాస్తు ఫారమ్‌లను ఉచితంగా పొందవచ్చు.

దరఖాస్తు స్వీకరణ ఈ నెల 17.08.2026 నుండి 27.08.2026 వరకు ఉదయం 11గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం,నల్గొండ-మీసేవ పరిపాలనాధికారి వద్ద సమర్పించగలరు.దరఖాస్తుతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానానికి సంబంధించిన సర్టిఫికెట్ జిరాక్స్,ఇంటర్/డిగ్రీ విద్యార్హత ధృవపత్రాల జిరాక్స్,వయసు ధృవీకరణకు ఎస్ఎస్సి మార్కుల మెమో లేదా జనన ధృవీకరణ పత్రం,

ఆధార్ కార్డు జిరాక్స్,నివాస ధృవీకరణ పత్రం,రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు,పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్-ఇది మౌఖిక పరీక్ష సమయంలో సమర్పించాలి.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.చంద్రశేఖర్ మాట్లాడుతూ, “అర్హతలున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.కేవలం దుకాణం నడపడం కాదు,ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావించాలి. నాణ్యమైన సేవలు అందించే వారికే ప్రాధాన్యత ఉంటుంది” అని సూచించారు.



# మిడ్జిల్ లో ఘనంగా నాగుల పంచమి వేడుకలు

**మిడ్జిల్, ఆగస్టు 17, (నేటి దర్శిని):** మిడ్జిల్ మండల కేంద్రంలో నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయం లో మరియు నాగదేవత విగ్రహాలకు భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ద తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నాగదేవత విగ్రహాలకు పంచామృతాలు, పాలతో అభిషేకాలు చేసి, పండ్లు మరియు పూలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెళ్లికాని యువతులు, సంతానం లేని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ కోరికలు నెరవేరాలని ప్రార్థించారు.నాగుల పంచమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ఆలయంలో భక్తులు పాల్గొన్నారు.



# ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి

- మండల ఎంపీడీవో అధికారి విజయ్ జైరాం




**ఆమనగల్లు, ఆగస్టు17 (నేటి దర్శిని):** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని మండల ఎంపీడీవో విజయ్ జై రాం అన్నారు. ఆమనగల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 27 వినతులను స్వీకరించారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి వినతిని సంబంధిత శాఖ అధికారులకు పంపించి,క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వినతులపై తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో సమర్పించాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలు, వినతులను ప్రజావాణి కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫహీం ఖాద్రీ,ఎంపీడీవో విజయ్ జైరాం,రాఘవేందర్ రెడ్డి,మండల విద్యాధికారి పాండు,శ్రీనివాస్ గౌడ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా సీనియర్ జర్నలిస్టు లింగాల నరేందర్ గౌడ్ జన్మదిన వేడుకలు





● వనస్థలిపురం కాంప్లెక్స్ సముదాయంలో వేడుకల్లో పాల్గొన్న జర్నలిస్టులు

**ఎల్బీనగర్, ఆగస్టు 17 (నేటి దర్శిని):** తొలివార్త తెలుగు దినపత్రిక ఎడిటర్, సీఈవో లింగాల నరేందర్ గౌడ్ జన్మదిన వేడుకలు సోమవారం ఎల్బీనగర్ నియోజకవర్గం వనస్థలిపురం డివిజన్ కాంప్లెక్స్ సముదాయంలో సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు లింగాల నరేందర్ గౌడ్ ను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా లింగాల నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. స్నేహం అనే పదానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన నా మిత్రులు నాపై చూపించినటువంటి ఆదరాభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వేడుకల్లో వివిధ రంగాల ప్రముఖులు హాజరై లింగాల నరేందర్ గౌడ్ కు ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ నర్రి రమేష్, ఓపెన్ ఫ్రేమ్ (ఇంగ్లీష్ దినపత్రిక) ఎడిటర్ కట్ట సత్య నారాయణ వివిధ రంగాల ప్రముఖులు రాచకొండ కృష్ణమోహన్, ఎం సంతోష్ రెడ్డి, గార్లపాటి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా నిర్మిస్తున్నశివాలయం గుడికి 75 వేల రూపాయలు విరాళం

● ఇచ్చిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి



**మిడ్జిల్, ఆగస్టు 17, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** నారాయణ పేట జిల్లా నర్వ మండలం లక్కర్ దొడ్డి గ్రామం లో నూతనం గా నిర్మిస్తున్న హనుమాన్ మరియు శివాలయం గుడికి 75000/- రూపాయలు ఇచ్చిన మాట ప్రకారం ధ్వజస్తంభ ఆరోహణ మరియు బొడ్రాయి పండగల సందర్భంగా లక్కర్ దొడ్డి గ్రామ సర్పంచ్ సుశీల దేవన్న ఆహ్వానం మేరకు వెళ్ళిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం 75000/- రూపాయలు ఆ గ్రామ ప్రజలు వివిధ పార్టీల నాయకుల సమక్షంలో సర్పంచ్ కి అందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం గ్రామ సర్పంచ్ సుశీల దేవన్న, ఉప సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్ శివ,బీజేపీ నర్వ మండల అధ్యక్షులు అజిత్ సింహా రెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ్ రామ్, నీరజ్,వావిళ్ళ వెంకటేశ్వర రెడ్డి,రామ్ రెడ్డి, పల్లె రామ్ రెడ్డి, హనుమంత్ రెడ్డి,మున్నూరు రామ్ రెడ్డి, గ్రామ బూత్ అధ్యక్షులు చందు, నర్వ బూత్ అధ్యక్షులు కిష్టారెడ్డి, బాలు, గ్రామ బీజేపీ నాయకులు కార్యకర్తలు మరియు వివిధ పార్టీల నాయకులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాలి

● పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరణకు అప్పగించొద్దు
● ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్




**రంగారెడ్డి జిల్లా ఆగస్ట్ 17 (నేటి దర్శిని):** డిప్లొమా, పాలిటెక్నిక్ విద్యను పౌర విశ్వవిద్యాలయాల్లో విలీనం చేసే ప్రతిపాదనను ప్రభుత్వం పునరాలోచించాలని ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటీకరణ లేదా ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానానికి అప్పగించకుండా వాటిని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ముఖ్యంగా పేద, మధ్యతరగతి, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తున్నాయని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యను ఇతర విద్యా వ్యవస్థల్లో విలీనం చేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ విద్యకు ప్రత్యేకమైన విద్యా విధానం, సాంకేతిక శిక్షణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. డిప్లొమా విద్యను ప్రత్యేక వ్యవస్థగా కొనసాగించడం ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్యలో బీటెక్, ఎంటెక్ తదితర కోర్సుల్లో చేరే అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మౌలిక వసతుల కొరతను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, తగిన నిధులు కేటాయించి భవనాలు, ప్రయోగశాలలు, పరికరాలు, వసతిగృహాలు, అధ్యాపకులు, సిబ్బంది నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి పాత్రను కొనసాగిస్తూ దానిని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. పాలిటెక్నిక్ అధ్యాపకులు, సిబ్బంది సేవా నిబంధనలకు రక్షణ కల్పించాలని తెలిపారు. అలాగే శక్తి విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వు 97లోని పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను వైఐఎస్‌యూలో విలీనం చేసే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని అన్నారు.ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, విద్యను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లకుండా పేద విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చూడాలని శ్రీకాంత్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ పట్టణ ఉపాధ్యక్షులు అదిల్, చరణ్, రాంచరణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, బబ్లు, రాజేష్, రాకేష్, భాను వంశీ, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత


● డీసీఎం వాహనంలో సుమారు 14 టన్నుల బియ్యం స్వాధీనం




**నిడమనూరు, ఆగస్టు17 (నేటి దర్శిని):** నిడమనూరు మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో శ్రీనివాస్ హోటల్ సమీపంలోని శ్రీనివాస్ రైస్ మిల్ నుంచి డీసీఎం వాహనం బియ్యం లోడ్‌తో బయటకు వచ్చి నిడమనూరు నుంచి హాలియా వైపు వెళ్తుండగా అనుమానంతో పోలీసులు వాహనాన్ని తనిఖీ చేశారు. యా 05 ఖణ 6292 నంబర్ గల డీసీఎం వాహనం వెనుక భాగంలోని పట్టాను తొలగించి పరిశీలించగా తెల్లని బస్తాలు కనిపించాయి. వాటిని విప్పి తనిఖీ చేయగా పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వాహనంలో సుమారు 14 టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బియ్యం రవాణాకు సంబంధించిన ప్రభుత్వ అనుమతి పత్రాలను చూపించాలని పోలీసులు డ్రైవర్‌ను కోరగా, తన వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేవని డ్రైవర్ మర్రేపల్లి సైదయ్య తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. దీంతో అనుమతి లేకుండా పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు వాహనాన్ని నిడమనూరు పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నిడమనూరు ఎస్ఐ డి. విజయ్ కుమార్ తెలిపారు.

# షాద్‌నగర్ నియోజకవర్గ ముసాయిదా ఓటరు జాబితా విడుదల

● సెప్టెంబర్ 16లోగా అభ్యంతరాలు, మార్పులకు దరఖాస్తులు చేసుకోవాలి
● షాద్‌నగర్ రెవెన్యూ డివిజనల్ అధికారిని ఎన్ఆర్ సరిత




**రంగారెడ్డి జిల్లా ఆగస్ట్ 17 (నేటి దర్శిని):** షాద్‌నగర్: 84-షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితాను ఎన్నికల అధికారులు షాద్‌నగర్ రెవెన్యూ డివిజనల్ అధికారిని ఎన్ఆర్ సరిత విడుదల చేశారు. ఓటర్ల జాబితా నమోదు చట్టం, 1960 నిబంధనల ప్రకారం రూపొందించిన ఈ ముసాయిదా జాబితా ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.కోతూర్, నందిగామ, కొందుర్గ్, చౌదరిగూడ, కేశంపేట, ఫరూఖ్‌నగర్ మండలాల ఏఈఆర్ఓ, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు షాద్‌నగర్ మున్సిపాలిటీ కార్యాలయంలో కార్యాలయ వేళల్లో ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించవచ్చని పేర్కొన్నారు. 2026 అక్టోబర్ 1వ తేదీని అర్హత తేదీగా పరిగణించి ఓటరు జాబితా రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ముసాయిదా జాబితాలో పేరు చేర్చడం, తొలగింపుపై అభ్యంతరాలు, ఓటరు వివరాల్లో మార్పులు, సవరణలు అవసరమైతే సెప్టెంబర్ 16వ తేదీలోగా నిర్ణీత నమూనాల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. పేరు చేర్పు కోసం ఫారం-6, సంబంధిత అభ్యంతరాలు, తొలగింపుల కోసం ఫారం-7, వివరాల సవరణలు, చిరునామా మార్పుల కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.ప్రజలు తమ పేర్లు, చిరునామా, వయస్సు, ఇతర వివరాలను ముసాయిదా ఓటరు జాబితాలో పరిశీలించుకుని తప్పులు ఉంటే నిర్ణీత గడువులో సరిచేసుకోవాలని అధికారులు సూచించారు. అలాగే 2026లో ఏప్రిల్ 1, జూలై 1 లేదా అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకునే అర్హత కలిగిన యువత ముందస్తుగా ఫారం-6 ద్వారా ఓటరు జాబితాలో పేరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు 84-షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, షాద్‌నగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఆధ్వర్యంలో నోటీసు జారీ చేశారు. నోటీసు తేదీ 2026 ఆగస్టు 17గా పేర్కొన్నారు.

## రంగారెడ్డి జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఏనుగు నరందర్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక



**ఇబ్రహీంపట్నం: (నేటి దర్శిని):(ఆగస్టు 17)** తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ (జీూజ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడ సర్పంచ్ ఏనుగు నరందర్ రెడ్డి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సర్వీ యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. జిల్లాలో, మండలాల్లో సమగ్ర అభివృద్ధి, గ్రామాల పురోభివృద్ధి, ప్రజల సంక్షేమం, మెరుగైన పరిపాలన కోసం సర్పంచుల సమిష్టి కృషిని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో నరందర్ రెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఫోరం సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా ఏనుగు నరందర్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు బాధ్యత మరింత పెరిగిందన్నారు. అందరి సహకారంతో రంగారెడ్డి జిల్లా పరిధిలోని గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.తన ఎన్నికకు సహకరించిన బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డికి, రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటీ)కి, జిల్లా, మండల బీఆర్ఎస్ నాయకులకు, సర్పంచులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## బిజినెస్

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

**హైదరాబాద్**

బంగారం ధరలు మరోసారి భారీగా పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో సోమవారం పసిడి ధరలు గణనీయంగా ఎగిశాయి. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ధరల పెరుగుదల మరోసారి షాక్ ఇచ్చింది. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములకు రూ.530 పెరిగింది. దీంతో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,660కు చేరింది. మరోవైపు 22 క్యారెట్ల బంగారం ధర కూడా పెరిగింది. 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.500 ఎగిసి రూ.1,42,700గా నమోదైంది. బంగారం ధరలు పెరుగుతున్నప్పటికీ వెండి ధరలో మాత్రం ఎలాంటి మార్పు కనిపించలేదు. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,54,900 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. ఇటీవల కాలంలో బంగారం ధరల్లో తరచూ హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మారుతున్న పరిస్థితులు, పెట్టుబడిదారుల డిమాండ్, డాలర్‌తో రూపాయి మారకం విలువ, ప్రపంచ ఆర్థిక పరిణామాలు వంటి అంశాలు పసిడి ధరలపై ప్రభావం చూపుతుంటాయి. దీంతో దేశీయ మార్కెట్‌లో కూడా బంగారం ధరలు రోజురోజుకూ మారుతున్నాయి. పెళ్లిళ్లు, శుభకార్యాలు, పండుగల కోసం బంగారం కొనుగోలు చేసే వారు ధరలను నిశితంగా గమనిస్తున్నారు. ధరలు భారీ స్థాయిలో ఉన్న నేపథ్యంలో కొనుగోలుదారులు అవసరాన్ని బట్టి



కొనుగోళ్లు చేయాలని మార్కెట్ వర్గాలు సూచిస్తున్నాయి. ఇదిలా ఉండగా, హైదరాబాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోని ఇతర నగరాల్లోనూ బంగారం, వెండి ధరల్లో స్వల్ప తేడాలు ఉండొచ్చు. స్థానిక పన్నులు, మార్కెట్ పరిస్థితులు, నగల తయారీ చార్జీలను బట్టి ఆభరణాల తుది ధర మారే అవకాశం ఉంటుంది.

**ప్రస్తుత ధరలు:**

24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు): రూ.1,55,660
22 క్యారెట్ల బంగారం (10 గ్రాములు): రూ.1,42,700
వెండి (1 కిలో): రూ.2,54,900

బంగారం ధరలు ఇప్పటికే రికార్డు స్థాయిలకు చేరువగా ఉండటంతో, రానున్న రోజుల్లో ధరల కదలికపై కొనుగోలుదారులు, పెట్టుబడిదారుల్లో ఆసక్తి నెలకొంది.

## అంతర్జాతీయ అనిశ్చితుల మధ్య నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు




**ముంబై**

అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితుల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం నష్టాలతో ముగిశాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో ప్రధాన సూచీలు వరుసగా నష్టాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ వరుసగా రెండో రోజు నష్టపోయింది. సోమవారం 281.09 పాయింట్లు తగ్గి 77,728.16 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 78.35 పాయింట్లు కోల్పోయి 24,287.65 వద్ద ముగిసింది. అయితే, ఇంట్రాడేలో నమోదైన కనిష్ఠ స్థాయిల నుంచి సూచీలు కొంతమేర కోలుకోవడం మదుపరులకు ఊరటనిచ్చింది. ముఖ్యంగా ఐటీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో అమ్మకాల కారణంగా మార్కెట్లపై ఒత్తిడి కనిపించింది. ఇదిలా ఉండగా, విదేశీ మారకద్రవ్య మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.61గా నమోదైంది. అంతర్జాతీయ పరిణామాలు, విదేశీ పెట్టుబడుల కదలికలు, రానున్న రోజుల్లో మార్కెట్ గమనాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## పతంజలి ఫుడ్స్ లాభం 336 కోట్లు

**న్యూఢిల్లీ,**

పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రూ.335.73 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.180.35 కోట్లతో పోలిస్తే 86 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో రూ.11,341.89 కోట్ల ఆదాయాన్ని ఆర్జించడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. క్రితం ఏడాది ఇది రూ.8,779 కోట్ల ఆదాయాన్ని గడించింది. దీంట్లో



వంటనూనెల వ్యాపారంతో సంస్థకు రూ.8,504 కోట్ల ఆదాయం సమకూరింది. అలాగే ఎఫ్ఎంసీజీ వర్టికల్ రూ.2,937.74 కోట్లు ఆదాయం లభించించింది. ప్రస్తుతం సంస్థ వంటనూనెలు, ఎఫ్ఎంసీజీ, పవన విద్యుత్తు రంగాల్లో సేవలు అందిస్తున్నది. మరోవైపు, 2025-26 ఆర్థిక సంత్సరానికిగాను కంపెనీ రూ.40,347.78 కోట్ల ఆదాయంపై రూ.1,814.47 కోట్ల నికర లాభాన్ని గడించింది.

## స్పోర్ట్స్

# రాజస్థాన్ రాయల్స్‌కు జైశ్వాల్ గుడ్ బై

**-ముంబై ఇండియన్స్‌లోకి వెళ్లే అవకాశం**

**-ఐపీఎల్ బిగ్గెస్ట్ ట్రేడ్ రూమర్!**

ఐపీఎల్ 2027 సీజన్‌కు ఇంకా చాలా సమయం ఉంది. అయినప్పటికీ, ఫ్రాంచైజీల మధ్య ఇప్పుడే ఆటగాళ్ల మార్పిడి (ట్రేడింగ్) వేడి ప్రారంభమైంది. రాజస్థాన్ రాయల్స్ జట్టులో టీమిండియా స్టార్ ఓపెనర్ యశస్వి జైశ్వాల్ భవిష్యత్తు ఇప్పుడు తీవ్ర ప్రశ్నార్థకంగా మారింది. ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు జైశ్వాల్‌ను రీటైన్ చేసుకోవాలా, ట్రేడ్ చేయాలా లేక వేలంలోకి రిలీజ్ చేయాలా అనే అంశంపై రాజస్థాన్ యాజమాన్యం తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. మైదానంలో పరుగుల కంటే జైస్వాల్ ఆటిట్యూడ్ విషయంలో ఫ్రాంచైజీ పూర్తిగా సంతృప్తిగా లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది.గడిచిన ఐపీఎల్ 2026 సీజన్‌లో యశస్వి 30.50 సగటు, 152 స్ట్రైక్ రేట్‌తో 427 పరుగులు సాధించాడు. ఇది మంచి ప్రదర్శనే అయినా.. రాజస్థాన్ జట్టులో అతడి స్థానంపై స్పష్టత కొరవడింది. దీనికి రెండు ప్రధాన అంశాలు దోహదపడుతున్నాయి. మొదటిది మేనేజ్‌మెంట్



అసంతృప్తి కాగా, రెండోది యంగ్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ సంచలన ఫామ్. సూర్యవంశీ వేగంగా ఎదగడంతో ఆర్ఆర్ ప్లేయింగ్ ఎలెవన్‌లో ఓపెనింగ్ స్థానానికి గట్టి పోటీ నెలకొంది. దీనికి తోడు సంజూ శాంసన్ స్థానంలో రియాన్ పరాగ్‌ను కెప్టెన్‌గా నియమించడం, జైశ్వాల్ కేవలం వైస్ కెప్టెన్‌గానే ఉండటం కూడా డ్రెస్సింగ్ రూమ్ సమీకరణాలను మార్చివేసింది. ఈ క్రమంలోనే జైశ్వాల్ ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ వైపు వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముంబైకి చెందిన జైశ్వాల్ స్థానిక రంజీ క్రికెటర్ కావడంతో ముంబై ఇండియన్స్ యాజమాన్యం అతడిని తమ జట్టులోకి తీసుకునేందుకు ఆసక్తి చూపుతోందట. ఈ క్రమంలో రాజస్థాన్ రాయల్స్ నుంచి జైశ్వాల్‌ను ముంబైకి పంపి, ప్రతిఫలంగా ముంబై నుంచి హార్దిక్ పాండ్యాను తీసుకునే 'ట్రేడ్ డీల్' పై చర్చలు నడుస్తున్నట్లు సమాచారం.అయితే, ఇప్పటివరకు ఈ ట్రేడ్ చర్చలపై రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం ట్రేడింగ్‌కు ఆటగాడి పూర్తి అంగీకారం తప్పనిసరి, కాబట్టి జైశ్వాల్ దీనికి గ్రీన్ సిగ్నల్ ఇస్తాడా లేదా అన్నది వేచి చూడాలి. ఒకవేళ ఈ మెగా ట్రేడ్ డీల్ నిజమైతే మాత్రం, ఇది రాబోయే ఐపీఎల్ 2027 సీజన్‌లోనే అత్యంత భారీ ట్రేడ్‌డీల్‌గా ఇది నిలవనుంది.

# గాంధీ జయంతి రోజునే 2027 వన్డే వరల్డ్ కప్ ప్రారంభం.. ఐసీసీ కీలక నిర్ణయం..!

**-2027 వన్డే ప్రపంచకప్ షెడ్యూల్‌లో మార్పులు**

**-గాంధీ జయంతి రోజునే మెగా టోర్నీ షురూ!**

**-అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్రణాళికలు**


వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలలో సంయుక్తంగా జరగనున్న ఐసీసీ 2027 వన్డే ప్రపంచకప్ ప్రారంభ తేదీపై ఒక ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. ఈ మెగా టోర్నీని వచ్చే ఏడాది అక్టోబర్ 2న, అంటే మహాత్మా గాంధీ జయంతి రోజున ప్రారంభించాలని ఐసీసీ భావిస్తోంది. భారత స్వాతంత్ర్య సమరయోధుడు గాంధీజీ దక్షిణాఫ్రికాలో 21 ఏళ్ల పాటు గడిపిన సంగతి తెలిసిందే. ఆయన సేవలకు, ప్రపంచ శాంతికి నివాళిగా గాంధీ జయంతి రోజే ప్రపంచకప్ పోరుకు తెరలేపాలని ఐసీసీ ప్రణాళికలు రచిస్తోంది.వాస్తవానికి ఈ టోర్నమెంట్‌ను అక్టోబర్ 8న ప్రారంభించి, అక్టోబర్ 1 నుంచి 7 వరకు వార్మప్ మ్యాచ్‌లు నిర్వహించాలని ఐసీసీ మొదట భావించింది. అయితే ఇప్పుడు షెడ్యూల్‌లో మార్పులు చేసి, వార్మప్ మ్యాచ్‌లను



ముందుకు జరిపి అక్టోబర్ 2 నుంచే ప్రధాన టోర్నీని ప్రారంభించేలా ప్లాన్ చేస్తున్నారు. నవంబర్ 21 (ఆదివారం) ఫైనల్ మ్యాచ్ జరగనుందని సమాచారంఈ మెగా టోర్నీ కోసం దక్షిణాఫ్రికాలో 8, జింబాబ్వేలో 3, నమీబియా రాజధాని విండ్‌హోక్‌లో 1 మొత్తం 12 వేదికలను ఐసీసీ ఇటీవల జోహన్నెస్‌బర్గ్‌లో జరిగిన కార్యక్రమంలో అధికారికంగా ప్రకటించింది. జోహన్నెస్‌బర్గ్ (వాండరర్స్), కేప్‌టౌన్, డర్బన్, హరారే వంటి చారిత్రాత్మక స్టేడియాలు ఈ మ్యాచ్‌లకు వేదిక కానున్నాయి. ఈసారి ప్రపంచకప్ ఫార్మాట్‌లో కూడా కీలక మార్పులు చేశారు. జట్లను రెండు గ్రూపులుగా విభజించి, ఆ తర్వాత 'సూపర్ సెవెన్' దశ, సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లను నిర్వహిస్తారు.ఆతిథ్య దక్షిణాఫ్రికా, జింబాబ్వేలతో పాటు భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్థాన్, ఇంగ్లాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ జట్లు ఇప్పటికే నేరుగా అర్హత సాధించాయి. మిగిలిన 4 స్థానాల కోసం వచ్చే ఏడాది ప్రారంభంలో నమీబియా, వెస్టిండీస్, ఐర్లాండ్‌లతో సహా 10 జట్ల మధ్య క్వాలిఫైయర్ టోర్నీ జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ, శాంతికి చిహ్నమైన గాంధీ జయంతి రోజున వరల్డ్ కప్ ప్రారంభించడం క్రీడా లోకంలో సరికొత్త సందేశాన్ని ఇస్తుందని భావిస్తున్నారు.

## రవీంద్ర జడేజా అరుదైన రికార్డు..

**-ఆల్‌రౌండర్ ఖాతాలో 350వ టెస్టు వికెట్**




**గాలే**

ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా.. అరుదైన క్లబ్‌లో చేరాడు. టెస్టుల్లో అతను 350వ వికెట్ తీసుకున్నాడు. శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో జడేజా.. ఈ ఘనతను సాధించాడు. భారత టెస్టు క్రికెట్‌లో 350 వికెట్లు తీసుకున్న అయిదో ప్లేయర్‌గా ఆల్‌రౌండర్ జడేజా నిలిచాడు. దీంతో పాటు టెస్టు చరిత్రలో 350 వికెట్లతో పాటు 4 వేల రన్స్ చేసిన క్రికెటర్ల జాబితాలో జడేజా నాలుగో స్థానంలో నిలిచాడు. ఈ ఘనత అందుకున్న క్రికెటర్లలో కపిల్ దేవ్, ఇయాన్ బోథమ్, డేనియల్ విట్టోరి ఉన్నారు.మరో వైపు శ్రీలంక తన తొలి ఇన్నింగ్స్‌లో తాజా సమాచారం ప్రకారం 274 రన్స్ చేసి 9 వికెట్లు కోల్పోయింది. సోనాల్ దినుషా సెంచరీ నమోదు చేశాడు. దినుషా 167 బంతుల్లో నాలుగు బౌండరీలు, రెండు సిక్సర్లతో సెంచరీ పూర్తి చేశాడు. ఆరో వికెట్‌కు డిక్వెల్లాతో కలిసి 146 రన్స్ జోడించి శ్రీలంకను ఆదుకున్నారు. చివరకు సెంచరీ హీరో దినుషా .. జడేజా బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూ అవుట్ అయ్యాడు.



బ్లాక్ డ్రెస్‌లో రఫ్ఫాడిస్తున్న రకుల్ ప్రీత్ సింగ్.. ఫోటోలు వైరల్

# వరుణ్ తేజ్‌కు బిగ్ రిలీఫ్..

## 'కొరియన్ కనకరాజు' రూ.50 కోట్ల క్లబ్‌లోకి!




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్కు బాక్సాఫీస్ వద్ద ఎట్టకేలకు మంచి విజయం దక్కింది. ఆయన తాజాగా నటించిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు' ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతంగా దూసుకెళ్తోంది. విడుదలైన తొలి వారాంతంలోనే మంచి వసూళ్లు సాధించిన ఈ చిత్రం.. ఆ తర్వాత వర్కింగ్ డేస్‌లోనూ కలెక్షన్లను నిలబెట్టుకుంది. 'కొరియన్ కనకరాజు'కు రెండో వారాంతంలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' నుంచి పోటీ ఎదురైంది. అయినప్పటికీ ఈ సినిమా తన వసూళ్లపై పెద్దగా ప్రభావం పడకుండా మంచి నంబర్లను నమోదు చేస్తోంది. తాజాగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.50 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటినట్లు చిత్రబృందం వెల్లడించింది. మిడ్-రేంజ్ హీరో సినిమాగా ఈ స్థాయి వసూళ్లు సాధించడం విశేషంగా మారింది. ముఖ్యంగా వరుణ్ తేజ్‌కు గత కొంతకాలంగా సరైన కమర్షియల్ సక్సెస్ కోసం ఎదురుచూపులు ఉండటంతో.. 'కొరియన్ కనకరాజు' విజయం ఆయనకు మంచి బూస్ట్ ఇచ్చిందనే చెప్పాలి.మెర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం హారర్, కామెడీ అంశాలను మేళవించి రూపొందించారు. కథనం, కామెడీ ట్రాక్‌లు, నటీనటుల పెర్ఫార్మెన్స్ సినిమాకు ప్లస్ పాయింట్లుగా నిలిచినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు యూత్‌ను కూడా ఈ చిత్రం ఆకట్టుకుంటోంది. తొలి వీకెండ్‌లో వచ్చిన మంచి స్పందనను సినిమా తర్వాతి రోజుల్లోనూ కొనసాగించడంతో కలెక్షన్లు నిలకడగా నమోదయ్యాయి. రెండో వీకెండ్‌లో పోటీ ఉన్నప్పటికీ రూ.50 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటడం సినిమాకు ఉన్న స్ట్రాంగ్ రన్‌ను సూచిస్తోంది. ఈ సినిమాలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించారు. సత్య, మురళీధర్ గౌడ్, శ్రీనివాస అవసరాల, మాస్టర్ రేవంత్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. నటీనటుల కామెడీ టైమింగ్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచినట్లు తెలుస్తోంది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. థమన్ సంగీతం అందించారు. నిర్మాణ విలువల విషయంలోనూ ఎక్కడా రాజీ పడకుండా సినిమాను తెరకెక్కించినట్లు తెలుస్తోంది. మొత్తానికి 'కొరియన్ కనకరాజు' రూ.50 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటడంతో వరుణ్ తేజ్‌కు బాక్సాఫీస్ వద్ద మంచి కంబ్యాక్ లభించినట్లయింది. మిగిలిన రోజుల్లో సినిమా మరింత వసూళ్లు సాధించి ఏ స్థాయి ఫైనల్ నంబర్‌ను అందుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.


# ముంబైలో క్లాసిక్ లవ్‌స్టోరీ?

తెలుగమ్మాయి శ్రీలీల దక్షిణాదిన సినిమాలు తగ్గించింది. దానికి కారణం విజయాలు లేక కాదు. ప్రస్తుతం ఈ ముద్దుగమ్మ కాన్సన్ట్రేషన్ అంతా బాలీవుడ్ పైనే. సాధారణంగా బాలీవుడ్ సినిమాలు ఏండ్ల తరబడి నిర్మాణాలు జరుపుకుంటూ ఉంటాయి. అందుకే.. కాల్‌షీట్స్ మధ్య క్లాష్ రాకుండా తాను ఎంతో నమ్మకం పెట్టుకున్న 'ఆషీకీ 3' సినిమాకు వీలైనంత ఎక్కువ కాల్‌షీట్స్ ఇచ్చి, శ్రద్ధంతా ఆ సినిమాపైనే పెట్టింది శ్రీలీల. యూత్‌ని టార్గెట్ చేస్తూ.. విజువల్ వండర్‌గా, అద్భుతమైన మ్యూజిక్‌తో ఓ దృశ్యకావ్యంగా దర్శకుడు అనురాగ్ బసు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్టు సమాచారం. బాలీవుడ్‌లోనూ క్లాసిక్ లవ్‌స్టోరీ వచ్చి చాలా కాలమైంది. ఈ నేపథ్యంలో 'ఆషీకీ 3'పై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇందులో శ్రీలీల పాత్ర కీలకంగా ఉంటుందట. అందుకే నటన విషయంలోనూ, లుక్స్ విషయంలోనూ ఆమె ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నదట. కార్తీక్ ఆర్యన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం ముంబైలో వేసిన భారీ సెట్స్‌లో వైభవంగా మొదలైంది. ఈ షెడ్యూల్‌లో కీలకమైన రొమాంటిక్ సన్నివేశాలతోపాటు, రెండు పాటలను కూడా చిత్రీకరించనున్నారు. 'బాలీవుడ్ తెరపై సత్తా చాటేందుకు 'ఆషీకీ 3'నే శ్రీలీలకు బలమైన వేదిక' అంటూ ఆమె అభిమానులు సైతం అభిప్రాయపడుతున్నారు.



# సూర్య 'విశ్వనాథ్ అండ్ సన్స్' జోరు..

## ఒక్క రోజులోనే 3.11 లక్షల టికెట్ల అమ్మకాలు!




స్టార్ హీరో సూర్య నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగిస్తోంది. విడుదలైన వెంటనే పాజిటివ్ టాక్ సొంతం చేసుకున్న ఈ ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా.. తొలి వీకెండ్‌ను ఘనంగా ముగించింది. ముఖ్యంగా ఆదివారం థియేటర్లలో ప్రేక్షకుల సందడి భారీగా కనిపించడంతో సినిమా కలెక్షన్లపై ట్రేడ్ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. 'విశ్వనాథ్ అండ్ సన్స్'కు ఆన్‌లైన్ బుకింగ్స్‌లోనూ మంచి స్పందన లభిస్తోంది. ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో ఆదివారం ఒక్కరోజే 3.11 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు మేకర్స్ వెల్లడించారు. గడిచిన 24 గంటల్లో 311.33ఖ టికెట్లు బుక్ కావడం సినిమాకు ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది.తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రధాన నగరాల్లోని మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్ థియేటర్లలోనూ ఆక్యుపెన్సీ బలంగా నమోదైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ ఈ సినిమాకు క్యూ కడుతుండటం కలెక్షన్లకు కలిసొస్తోంది. తల్లీ కొడుకుల అనుబంధం, కుటుంబ భావోద్వేగాలను ప్రధానంగా తీసుకుని దర్శకుడు వెంకీ అట్లూరి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. కథలోని ఎమోషనల్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు సూర్య నటనకు కూడా ప్రశంసలు లభిస్తున్నాయి. సూర్య సరసన మమితా బైజు హీరోయిన్‌గా నటించగా, రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. సినిమాలోని పాత్రలకు తగినట్లుగా నటీనటుల పెర్ఫార్మెన్స్ ఉండటంతో ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి మంచి స్పందన వస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. తొలి వీకెండ్‌లో బలమైన వసూళ్లతో దూసుకెళ్లిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'కు ఇప్పుడు అసలు పరీక్ష మొదలుకానుంది. సోమవారం నుంచి వర్కింగ్ డేస్‌లోనూ ఆక్యుపెన్సీని నిలబెట్టుకుంటే సినిమా బాక్సాఫీస్ వద్ద మరింత బలమైన నంబర్లను నమోదు చేసే అవకాశం ఉంది. మొత్తంగా 3.11 లక్షల టికెట్ల ఒక్కరోజు సేల్స్‌తో సూర్య సినిమా జోరు ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది.

# చిరంజీవి 158లో అదిరిపోయే స్పెషల్ సాంగ్..

## స్టైలిష్ లుక్ లాక్ చేసిన మెగాస్టార్!



మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ మూవీకి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు మెగా అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. భారీ యాక్షన్ షెడ్యూల్‌లో భాగంగా కీలకమైన పోరాట సన్నివేశాలను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్స్ రామ్--లక్ష్మణ్ మాస్టర్స్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో ఫైటర్లతో ఈ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం.సినిమాలో యాక్షన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉండటంతో ఈ సన్నివేశాలను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి అభిమానులను ఆకట్టుకునేలా యాక్షన్ ఎపిసోడ్స్‌ను డిజైన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమా నుంచి మరో క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న యాక్షన్ షెడ్యూల్ పూర్తయిన తర్వాత వచ్చే వారం నుంచి స్పెషల్ సాంగ్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ పాటలో చిరంజీవి పూర్తిగా స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారట. ఈ స్పెషల్ సాంగ్ కోసం మెగాస్టార్ లుక్‌ను ఇప్పటికే లాక్ చేసినట్లు సమాచారం. చిరంజీవి ఎనర్జీకి తగ్గట్టుగా పాటను డిజైన్ చేస్తున్నారని, తెరపై ఆయన స్టైలిష్ అవతార్ అభిమానులను మెస్మరైజ్ చేయడం ఖాయమని చిత్ర వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో చిరంజీవి పాత్రను దర్శకుడు బాబీ చాలా ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. మెగాస్టార్ పాత్రలో పలు రకాల వేరియేషన్స్ ఉంటాయని సమాచారం. ఇప్పటివరకు చిరంజీవిని చూడని ఓ కొత్త కోణంలో ప్రేక్షకులకు చూపించాలనే ఉద్దేశంతో బాబీ ఈ కథను సిద్ధం చేసినట్లు టాక్. అదే సమయంలో సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్‌కు కూడా పెద్దపీట వేస్తున్నట్లు తెలుస్తోంది. యాక్షన్, ఎమోషన్, ఫ్యామిలీ డ్రామాతో పాటు చిరంజీవి స్టైల్, కామెడీ, మాస్ ఎలిమెంట్స్‌ను మేళవించి కథను రూపొందిస్తున్నట్లు సమాచారం. చిరంజీవి--బాబీ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' భారీ విజయాన్ని అందుకుంది. మెగాస్టార్ మాస్ ఇమేజ్‌ను బాబీ అద్భుతంగా ప్రెజెంట్ చేయడంతో ఆ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. దీంతో ఈ కాంబినేషన్‌లో వస్తున్న కొత్త సినిమాపై సహజంగానే భారీ అంచనాలు ఏర్పడ్డాయి.ఈసారి మాత్రం 'వాల్తేరు వీరయ్య'కు పూర్తి భిన్నంగా చిరంజీవిని కొత్తగా చూపించేందుకు బాబీ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. కథ, పాత్రల డిజైన్, యాక్షన్ సన్నివేశాలు, ఫ్యామిలీ ఎమోషన్స్ ఇలా ప్రతి అంశంలోనూ ప్రత్యేకత ఉండేలా ప్లాన్ చేస్తున్నారని సమాచారం.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365